# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
29-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 11

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## పడి లేచిన కెరటం..
# తెలుగుదేశం!

నేడు టిడిపి 45వ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ.. నాలుగున్నర దశాబ్దాలుగా తనకంటూ ముద్ర చాటుకుంది. పడి లేచిన కెరటం. పడిపోయిన ప్రతిసారి అదే స్థాయిలో ఉవ్వెత్తున ఎగసి పడింది. జాతీయ పార్టీలే మనుగడ సాధించలేని ఈ రోజుల్లో.. నాలుగు దశాబ్దాల పాటు తెలుగు రాజకీయాలను శాసించగలిగింది. నందమూరి తారక రామారావు వేసిన పునాది.. నారా చంద్రబాబు నిర్మాణం..వెరసి తెలుగుదేశం పార్టీ తెలుగు నేలపైనే కాదు.. జాతీయ స్థాయిలో సైతం సత్తా చాటింది. ప్రాంతీయ పార్టీలకు దిక్సూచిగా మారింది. నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'క్రైమ్ మిర్రర్' ప్రత్యేక కథనం.

## పడిపోయిన ప్రతిసారి ఉవ్వెత్తున ఎగసి పడి..

- ఎన్నో సంక్షోభాలు దాటుకొని విజయతీరాల వైపు..
- ఎన్టీఆర్ పునాది, చంద్రబాబు నిర్మాణమే విజయ సోపానం

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:

తెలుగువాడి ఆత్మగౌరవం పేరుతో.. ఏపీని ఢిల్లీ శాసించే రోజులు అవి. తెలుగు పాలకులు ఎవరో ఢిల్లీ నుంచి వచ్చే షీల్డ్ కవర్లో తేలేది. అటువంటి సమయంలో తెలుగు వాడి ఆత్మ గౌరవం పేరుతో నందమూరి తారక రామారావు ముందుకు వచ్చారు.

- మిగతా 3వ పేజీలో



## మట్టిలో మాణిక్యాలను వెలికితీసేలా క్రీడా పాలసీ

- ప్రత్యేక తెలంగాణలో క్రీడా స్ఫూర్తి కనుమరుగు
- అందుకే స్పోర్ట్స్ పాలసీ, క్రీడలకు ప్రాధాన్యం
- 2034లో గచ్చిబౌలిలో ఒలింపిక్స్: సీఎం రేవంత రెడ్డి
- ఎల్బీ స్టేడియంలో శాసనసభ్యుల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం
- ఆకట్టుకున్న సీఎం ఫుట్‌బాల్.. కబడ్డీలో వాకిటి సత్తా
- లెమన అండ్ స్పూనలో కొండా సురేఖ విజయం

క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్రీడల్లో రాణించేవారికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారు. రాష్ట్ర శాసన మండలి, శాసన సభ సభ్యులకు బడ్జెట్ సమావేశాల సందర్భంగా క్రీడలు,

మిగతా 3లో



# అంతా రేవంత్ 'హస్తం'

- తెలంగాణ నిర్ణయాలంతా సీఎం చేతిలోనే..
- కాంగ్రెస్ సీనియర్లకు షాక్
- ఫిర్యాదులు చెల్లని కాసులే
- ఏఐసీసీ కి నో ఆప్షన్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీగా మారిందా? రేవంత్ రెడ్డి చేతిలోకి వెళ్లిపోయిందా? ఏఐసీసీ సైతం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితికి వెళ్లిందా? కాంగ్రెస్ లో సీనియర్లను రేవంత్ సాగనంపనున్నారా? టిడిపిలో అనుసరించిన విధానాన్ని కొనసాగిస్తున్నారా? తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్లు తీవ్ర ఆందోళనతో ఉన్నట్లు అర్థమవుతోంది.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో



### 15 మంది సీనియర్లపై గురి..

ఇటీవల కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నేత జీవన్ రెడ్డి గుడ్ బై చెప్పారు. దాదాపు నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని విడిచి పెట్టుకున్నారు. కేవలం సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే తాను కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పినట్లు జీవన్ రెడ్డి ప్రకటించారు. తన నెక్స్ట్ టార్గెట్ రేవంత్ అని తేల్చేశారు. ఆయన మూలంగా తాను ఒక్కడినే కాదని.. సీనియర్లంతా బాధపడుతున్నారంటూ చెప్పుకొచ్చారు. అదే సమయంలో మహబూబ్నగర్ కు చెందిన

మిగతా 3లో

## బిజెపిలో 'పొత్తు' కలకలం!

### గులాబి పార్టీతో కమలం

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాట్ కామెంట్స్
- భారతీయ జనతా పార్టీ హైకమాండ్ గరం గరం

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో సొంతంగా అధికారంలోకి రావాలనుకుంటుంది

మిగతా 2లో

## వయోవృద్ధుల కమిషన్!



### తల్లిదండ్రుల పోషణ చట్టంతో ఏర్పాటు

- అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే ఉద్యోగి జీతం నుంచి గరిష్ఠంగా రూ.10 వేల కోత.. వారి ఖాతాలో జమ
- శాఖ అధికారి పరిష్కరించకపోతే.. కమిషనకు ఫిర్యాదు చేయొచ్చు
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు వర్తింపు

వృద్ధాప్యంలో ఉన్న తమను తమ పిల్లలు పట్టించుకోక.. భారంగా బతుకీడ్చే తల్లిదండ్రులకు గొప్ప మేలు చేసే నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుంది. తల్లిదండ్రులను పట్టించుకోకుండా వదిలేసే ఉద్యోగుల వేతనాల నుంచి గరిష్ఠంగా రూ.10 వేల మేర కోత విధించి, తల్లిదండ్రుల పోషణ నిమిత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చట్టం చేసింది. అంతేకాదు.. ఈ చట్టం అమలు కోసం 'వయోవృద్ధుల కమిషన'ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఒక ప్రధాన కమిషనర్, ఇద్దరు కమిషనర్లు ఉంటారు. ఈ మేరకు 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం,

మిగతా 2లో

## కవిత స్కెచ్ ఫిక్స్!



- తొలి టార్గెట్ బిఆర్ఎస్
- ఆ పార్టీ వ్యతిరేక, అనుకూల వర్గాలను తన వైపు తిప్పుకునేందుకు నిర్ణయం
- ఏప్రిల్ 25న మేడ్చల్ వేదికగా కొత్త పార్టీ

తెలంగాణలో కల్వకుంట్ల కవిత తన సరికొత్త రాజకీయం ప్రారంభించారు. తన కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి గురించి కీలక సంకేతాలు ఇచ్చారు. ఏప్రిల్ 25న మేడ్చల్ వేదికగా పార్టీని ప్రకటిస్తానని తేల్చి చెప్పారు. తెలంగాణ ప్రజా జాగృతిని అసలు సిసలైన తెలంగాణ పార్టీగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: గులాబీ పార్టీ పని అయిపోయిందని తేల్చి చెప్పారు. నిజమైన తెలంగాణ ఉద్యమకారులు తన వెంటే ఉన్నారని చెప్పుకొచ్చారు కవిత. తద్వారా బిఆర్ఎస్ కు ఆదిలోనే దెబ్బతీయాలని చూస్తున్నట్టు ఉన్నారు కవిత. పక్కా వ్యూహంతోనే ఆమె అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే కవిత ప్రకటనతో గులాబీ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది.

మిగతా 2లో



## మోడీ టీంలోకి పురందేశ్వరి!

- కేంద్రమంత్రిగా ఛాన్స్
- పిలిచి మరీ చెప్పిన ప్రధాని

మిగతా 2లో

## మంత్రి పొంగులేటికి షాక్!



- రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ పై దర్యాప్తు
- అవకతవకలపై ఇటీవల అనేక ఫిరాజ్యదులు
- సీఎం రేవంత్ సంచలన నిర్ణయం

## ఎట్టకేలకు వంగవీటి వారసుడికి అదృష్టం!

- రాధాకృష్ణకు కీలక పదవి
- ముందుగా ఎమ్మెల్సీ, ఆపై క్యాబినెట్లోకి
- చంద్రబాబుతో పాటు పవన్ సానుకూలత
- నారా లోకేష్ సైతం ప్రత్యేక చొరవ

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: వంగవీటి రాధాకృష్ణకు మంచి రోజులు వస్తున్నాయా? త్వరలో ఆయనకు




# మోడీ టీంలోకి పురందేశ్వరి!

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: కేంద్ర మంత్రివర్గ విస్తరణకు ప్రధాని నరేంద్ర మోడీ కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. కచ్చితంగా ఈ వేసవిలోనే విస్తరణ ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో విస్తరణ ఖాయమని ప్రచారం సాగుతోంది. ఈ పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల్లో బిజెపి నుంచి మరింత మంది మంత్రి పదవులు ఇస్తారని తెలుస్తోంది. ముఖ్యంగా ఏపీ నుంచి దగ్గుబాటి పురందేశ్వరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల ఆమె తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకున్నారు. మోడీ ప్రత్యేకంగా పిలిచి పురందేశ్వరి తో మాట్లాడినట్లు తెలుస్తోంది. త్వరలో మంత్రి పదవి ఇవ్వబోతున్నట్లు స్వయంగా ప్రధాని చెప్పినట్లు సమాచారం. అదే జరిగితే నందమూరి కుటుంబానికి మరో అరుదైన గౌరవం దక్కినట్టే.

### భర్తతో పాటు కాంగ్రెస్ లోకి

తెలుగుదేశం పార్టీలో పురందేశ్వరి భర్త వెంకటేశ్వరరావు క్రియాశీలకంగా పనిచేశారు. కానీ చంద్రబాబుతో తలెత్తిన విభేదాలతో పురందేశ్వరి తన భర్త వెంకటేశ్వరరావు తో పాటు బయటకు వచ్చేసారు. నందమూరి తారక రామారావు కుమార్తెగా గుర్తింపు పొందిన పురందేశ్వరిని కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఆహ్వానించింది. అలా కాంగ్రెస్ పార్టీలో చేరిన పురందేశ్వరి 2004 ఎన్నికల్లో తొలిసారిగా బాపట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. పార్లమెంట్లో అడుగు పెట్టారు. 2009లో పురందేశ్వరి విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. యూపీఏ 2 ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2014లో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి బిజెపిలో చేరారు. టిడిపి తో పొత్తులో భాగంగా రాజంపేట నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి ఆమెకు వరించింది. అలా బిజెపిలో కొనసాగుతూ టిడిపి తో పొత్తు కోసం గట్టిగానే కృషి చేశారు. అనుకున్నట్టుగానే పొత్తు వర్కౌట్ అయ్యింది. కూటమి ఘనవిజయం సాధించింది. అయితే అప్పట్లో మంత్రివర్గంలో చోటు దక్కలేదు కానీ.. ఇప్పుడు విస్తరణలో మాత్రం ఆమెకు ఛాన్స్ ఇస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

### అప్పట్లో దక్కని మంత్రి పదవి..

2024 ఎన్నికల్లో రాజమండ్రి పార్లమెంట్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు పురందేశ్వరి. అప్పటికే ఆమె ఏపీ బీజేపీ చీఫ్. మూడు పార్టీల మధ్య పొత్తుల క్రియాశీలక పాత్ర పోషించారు. అందుకే పురందేశ్వరికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దాకడం ఖాయమని అంచనాలు ఉండేవి. కానీ వివిధ సమీకరణల్లో భాగంగా పురందేశ్వరికి ఎటువంటి ఛాన్స్ దక్కలేదు. ఏపీ నుంచి బిజెపి తరఫున నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కు అవకాశం దక్కింది. దీంతో పురందేశ్వరికి తీవ్ర నిరాశ మిగిలింది. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పొత్తులో భాగంగా ఓట్లతో పాటు సీట్లు సాధించుకున్న బిజెపి భవిష్యత్తుపై గట్టి వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా ఎంపీగా ఉన్న పురందేశ్వరి కి ఛాన్స్ ఇస్తే.. ఏపీ నుంచి రాజకీయంగా కలిసి వస్తుందని అంచనా వేస్తోంది బిజెపి. అందుకే కేంద్రమంత్రిగా అనుభవం ఉన్న పురందేశ్వరికి ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. వాస్తవానికి పురందేశ్వరి పేరును లోక్సభ డిప్యూటీ స్పీకర్ పదవికి వినిపించింది. కానీ కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రధాని మోడీ భావిస్తున్నారు. ఇప్పటికే జాతీయస్థాయిలో మహిళా మంత్రిగా నిర్మల సీతారామన్ ఉన్నారు. మంత్రివర్గంలో మహిళల ప్రాతినిధ్యం పెంచడం ద్వారా.. మహిళా ఉంటుందని పై బిజెపి హై కమాండ్ గురిపెట్టినట్లు తెలుస్తోంది. అందుకే ప్రధాని పిలిచి మరి ఈ విషయాన్ని పురందేశ్వరికి చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

# కవిత స్కెచ్ ఫిక్స్!

### ఏ పార్టీకి బీ టీం కాదు

అయితే కవిత ప్రత్యేక వ్యూహం ఏంటి అనేది తెలియడం లేదు. అయితే జాతీయ పార్టీలకు బి టీం అని విమర్శలు వస్తున్న వేళ ఆమె ఫుల్ క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో రాజకీయ పార్టీల ఏర్పాటు సమయంలో ఇటువంటి విమర్శలు రావడం సహజమేనని తేల్చి చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఉన్నవారు.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన వారంతా తన వెంట ఉన్నారని చెప్పుకొచ్చారు. తద్వారా గులాబీ పార్టీని ఆమె టార్గెట్ చేసినట్టు కనిపిస్తున్నారు. తెలంగాణను తెచ్చిన పార్టీగా పదేళ్లపాటు పాలించింది గులాబీ పార్టీ అని.. ఇప్పటికీ నీళ్లు, నిధుల విషయంలో ఆ పార్టీ వైఫల్యం కనిపిస్తోందని మండిపడ్డారు. తద్వారా బంగారు తెలంగాణ అనే అంశాన్ని టార్గెట్ చేసుకున్నారు. అదే సమయంలో ఉద్యమ తెలంగాణలో పనిచేసిన నేతలను ఆకర్షించే పనిలో పడ్డారు.

**ఫోకస్ అంతా వారిపైనే..:** ప్రస్తుతం కల్వకుంట్ల కవిత కేవలం బి ఆర్ ఎస్ పైనే ఫుల్ ఫోకస్ పెట్టారు. ఆ పార్టీ వైఫల్యాలనే ప్రస్తావిస్తున్నారు. తద్వారా ఆ పార్టీ క్యాడర్ను ఆకర్షించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు కనిపిస్తున్నారు. వరుస అపజయాలతో గులాబీ పార్టీ క్యాడర్ తీవ్ర నిరాశ నిస్పృహలతో గడుపుతోంది. దానిని క్యాచ్ చేసే పనిలో ఉన్నారట కవిత. అందుకే తన తొలి టార్గెట్ ఆ పార్టీ పైనే పెట్టారు. క్రమేపి ప్రజల్లో బలం పెరగడం ద్వారా.. జాతీయ పార్టీలైన కాంగ్రెస్ తో పాటు బిజెపిని సైతం టార్గెట్ చేయాలనుకుంటున్నారు. ఒక మహిళ నేతగా.. తెలంగాణ సంప్రదాయ జాగృతి వేదికగా కవిత చేసిన రాజకీయాలు వినూత్నంగా ఉంటాయి. ఇప్పుడు కూడా ఆమె అదే ప్రయత్నంలో ఉన్నట్లు అర్థమవుతుంది. కేవలం మూడు వర్గాలను ఆమె టార్గెట్ చేసుకున్నారు. ఉద్యమ తెలంగాణలో పని చేసిన వారు.. యువతతో పాటు మహిళలు ఆమె లక్ష్యంగా కనిపిస్తున్నారు.

**ఆ బాధిత వర్గాలే..:** కెసిఆర్ పార్టీ ఎవరినైతే నిర్లక్ష్యం చేసిందో వారినే తన వైపు తిప్పుకోవాలని చూస్తున్నారు కవిత. అందులో భాగంగానే నిరుద్యోగ యువతను టార్గెట్ చేశారు. నీరు ఇవ్వలేక రైతులకు ఇబ్బంది పెట్టారని ఆరోపణలు చేయడం ద్వారా అన్నదాతలను తన వైపు తిప్పుకునేలా చేశారు. తొమ్మిదేళ్ల కెసిఆర్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఉద్యమ తెలంగాణ నేతలను ఆకర్షించే పనిలో పడినట్టు కనిపిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ జాగృతి ద్వారా ఆమె మహిళలకు దగ్గరయ్యారు. వారిని మరింత దగ్గరగా చేర్చుకోవాలన్న ప్రయత్నంలో.. మహిళల సమస్యలను కూడా ప్రస్తావించనున్నారట కవిత. రాజకీయాల పట్ల ఆసక్తిగా ఉన్న యువతను సైతం తన పార్టీలో చేర్చుకోవాలని బలమైన ఆకాంక్షతో ఉన్నారు. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే మాత్రం కవిత నుంచి తొలి దెబ్బ గులాబీ పార్టీకేనని స్పష్టమవుతోంది. అయితే గులాబీ పార్టీ లైట్ తీసుకుంటుందా? కవిత విషయంలో సీరియస్ యాక్షన్ లోకి దిగుతుందా? అనేది చూడాలి.

# మంత్రి పొంగులేటికి షాక్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ పై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. ఆయనకు చెందిన రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు ఇచ్చారు. సొంత మంత్రివర్గంలో మంత్రిపై ఏకంగా సీఎం రేవంత్ ఈ తరహా ఆదేశాలు ఇవ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో సరికొత్త చర్చకు దారితీసింది. గత కొంతకాలంగా రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరుణంలోనే సీఎం రేవంత్ ఈ ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే సీఎం రేవంత్ ఆదేశాలపై రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సొంత ప్రభుత్వంలో విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా? లేకుంటే సక్రమంగా జరుగుతుందా? అనే చర్చ మాత్రం సాగుతోంది.

### పాలేరు నుంచి గెలుపు..

మొన్నటి ఎన్నికల్లో ఖమ్మం జిల్లా పాలేరు నుంచి గెలిచారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కు ముందు ఆయన గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్లో చేరారు. స్వతహాగా పారిశ్రామికవేత్త అయిన పొంగులేటి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. ఆ ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేసి గెలిచారు. దీంతో రేవంత్ తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కీలకమైన రెవెన్యూ, గృహ నిర్మాణ,, సమాచార మంత్రిగా ఛాన్స్ ఇచ్చారు. అయితే తెలంగాణలో పలు పనులు దక్కించుకున్న రాఘవ కంస్ట్రక్షన్స్ పై వరుస



ఫిర్యాదులు వస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు దీనినే హైలెట్ చేస్తున్నారు. దీంతో విచారణకు ఆదేశించారు రేవంత్.

### తప్పని తేలితే మంత్రి పదవికి రాజీనామా..

అయితే ఈ విచారణలో రాఘవా కన్స్ట్రక్షన్స్ లో అక్రమాలు ఉన్నాయని తేలితే కచ్చితంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలి. అందుకే ఇప్పుడు రేవంత్ ఇచ్చిన ఆదేశాలపై అనేక రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పొంగులేటి చుట్టూ ఉచ్చు బిగించేందుకు ఈ నిర్ణయానికి వచ్చారా అనే అనుమానం కూడా ఉంది. ఆది నుంచి పొంగులేటి విషయంలో ఈ తరహా ఆరోపణలు రావడం సహజం. అయితే ఆయన రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా ముద్రపడ్డారు. అయినా సరే రేవంత్ ఆదేశాలు ఇచ్చారు అంటే సవ్యంగా దర్యాప్తు జరుగుతుందా? అనే అనుమానం కలగక మానదు.

### వైసీపీ ఎంపీగా..

కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. స్వతహాగా పారిశ్రామికవేత్త కూడా. 2014 తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. టిడిపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు పై 11 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. కొద్దిరోజులపాటు తెలంగాణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. తరువాత వైసిపి గులాబీ పార్టీలో విలీనం కావడంతో ఆ పార్టీ ఎంపీగా చలామణి అయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తో పాటు 2019 పార్లమెంటు ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలుపు కోసం గట్టిగానే కృషి చేశారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా కామెంట్స్ చేశారని గులాబీ పార్టీ సస్పెండ్ చేసింది. దీంతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా ఆ ఎన్నికల్లో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థిగా ఛాన్స్ దక్కించుకున్నారు. గెలిచిన శ్రీనివాస్ రెడ్డిని తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు రేవంత్. ఇప్పుడు పొంగులేటి కంపెనీ రాఘవ కంస్ట్రక్షన్ పై ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ విచారణలో తప్పు అని తెలిస్తే మాత్రం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఉండడంతో విచారణపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..ఓ

# వయోవృద్ధుల కమిషన్!

పర్యవేక్షణ చట్టం-2026' (టీఈఏఎంపీఎస్) కోసం బిల్లును శనివారం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లులో పలు అంశాలను పొందుపర్చింది. తల్లిదండ్రుల యోగక్షేమాలను చూడడం, వారికి సేవలు చేయడం పిల్లల బాధ్యత అని, ఇది భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రధానమైన అంశమని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలహీనమైపోతోందని, పిల్లలు తమ తల్లిదండ్రులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే.. కుటుంబ విలువలను సంరక్షించడానికి అవసరమైన ప్రమాణాలను రూపొందించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపింది. తల్లిదండ్రుల యోగక్షేమాలను నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగుల్లో నైతిక బాధ్యతను పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తించి, ఈ నూతన చట్టాన్ని తీసుకొస్తున్నట్లు స్పష్టం చేసింది. నిర్లక్ష్యానికి గురయ్యే తల్లిదండ్రుల పోషణ కోసం ఉద్యోగి నెలవారి జీతం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు (ఏది తక్కువైతే అది) మినహాయించి తల్లిదండ్రులకు చెల్లించడం జరుగుతుందని వివరించింది. ఇది కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రభుత్వ రంగ కార్పొరేషన్లు, పంచాయతీరాజ్ చట్టం, మునిసిపల్ చట్టం కింద పని చేసే సిబ్బంది, ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బందికి కూడా వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తేదీ నుంచి ఆరు నెలల్లోపు ఆయా శాఖలు, సంస్థలు తమ ఉద్యోగులకు సంబంధించిన నియమాలను సవరించుకోవాలని సూచించింది.

**చట్టం అమలవుతుంది ఇలా..:** ఈ చట్టం ఎలా అమలవుతుందన్న దానిని కూడా ప్రభుత్వం బిల్లులో వివరించింది. తమ బాగోగులను పట్టించుకోని పిల్లలపై తల్లిదండ్రులు ఇద్దరుగానీ ఒక్కరుగానీ.. వారి పిల్లలు పని చేసే శాఖ విభాగాధిపతికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఆ అధికారి 60 రోజుల్లోగా ఫిర్యాదును పరిష్కరించాలి. అక్కడ పరిష్కారం కాకపోతే తల్లిదండ్రులు 'వయోవృద్ధుల కమిషన' వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. కమిషన ఆ ఫిర్యాదును 45 రోజుల్లో తప్పనిసరిగా పరిష్కరించాలి. ఈ కమిషనకు ప్రధాన కమిషనర్గా ఉన్నత న్యాయస్థానాల్లో పని చేసి, పదవీ విరమణ పొందిన వ్యక్తిని నియమిస్తారు. కాగా బిల్లులో కొన్ని పదాలకు వివరణ ఇచ్చారు. తగిన సొంత ఆదాయం లేనివారు, తమను తాము పోషించుకోలేని వారిని ఆధారపడిన తల్లిదండ్రులుగా నిర్వచించారు. ఆహారం, ఆశ్రయం, దుస్తులు, వైద్య చికిత్సలు మొదలైన వాటిని ప్రాథమిక అవసరాలుగా పేర్కొన్నారు.

# ఎట్టకేలకు వంగవీటి వారసుడికి అదృష్టం!

కీలక పదవి వరించనుందా? ఈ మేరకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా? డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం సానుకూలంగా ఉన్నారా? మంత్రి నారా లోకేష్ సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ప్రస్తుతం కాపుల అంశం చుట్టూ ఏపీ రాజకీయాలు తిరుగుతుండడంతో ఇప్పుడు వంగవీటి రాధాకృష్ణ సేవలను కూటమి వినియోగించుకోవాలని చూస్తోంది. ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది.

వంగవీటి మోహన్ రంగ వారసుడిగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు రాధాకృష్ణ. మోహన్ రంగా కాపుల్లో ఒక ఐకానిక్ లీడర్ గా నిలిచారు. కేవలం ఒక సామాజిక వర్గం మాత్రమే కాదు.. బడుగు బలహీన వర్గాల వారికి అండగా నిలిచారు. ఈ క్రమంలోనే పేదల ఇళ్ల కోసం నిరసన శిబిరంలో ఉన్న వంగవీటి మోహన్ రంగ దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో రాధాకృష్ణ చాలా చిన్నవాడు. అటు తరువాత రంగా హత్య కేసు విచారణ కొలిక్కి రాలేదు. దీనిపై రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ వచ్చాయి. అయితే రాధాకృష్ణ అందుబాటులోకి వచ్చి రాజకీయం చేయడం ప్రారంభించారు. కానీ ఏపీ రాజకీయాల్లో అనుకున్న స్థాయిలో ఆయన రాణించలేకపోయారు. సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం అందుకు కారణం.

### కాంగ్రెస్ లో అరుదైన చాన్స్

2003లో వైయస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా



పాదయాత్ర చేశారు. అందులో భాగంగానే మోహన్ రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. 2004 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన రాధాకృష్ణ అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అత్యంత చిన్న వయస్సు నేతగా గుర్తింపు పొందారు. కానీ 2009 ఎన్నికల్లో ఆయన తప్పుడు నిర్ణయం తీసుకున్నారు. రాజశేఖర్ రెడ్డి వద్దని వారించినా వినకుండా చిరంజీవి ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు 2014 ఎన్నికల్లో. కానీ ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టికెట్ ఆశించారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున. కానీ జగన్ మోహన్ రెడ్డి మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయాలని సూచించారు. అందుకు అంగీకరించని రాధాకృష్ణ జగన్మోహన్ రెడ్డితో విభేదించి ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. 2019 ఎన్నికల సమయంలో టిడిపిలో చేరి స్టార్ క్యాంపెయినర్గా పనిచేశారు. కానీ ఆ ఎన్నికల్లో టిడిపి ఓడిపోయింది. అయినా సరే అదే పార్టీలో కొనసాగారు. 2024 ఎన్నికల్లో కూటమి తరుపున పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

### వైసీపీకి చెక్..

కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు సమీపిస్తోంది. కానీ వంగవీటి రాధాకృష్ణకు ఇంతవరకు నామినేటెడ్ పదవి దక్కలేదు. ఎమ్మెల్సీ తో పాటు రాజ్యసభ పదవుల ఎంపిక సమయంలో ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తూ వస్తోంది. కానీ తరువాత సమీకరణలో భాగంగా ఆయనకు చాన్స్ లేకుండా పోతోంది. అయితే ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు రాజకీయాన్ని తెరపైకి తెస్తోంది. కూటమి ప్రభుత్వంలో కాపులకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తోంది. ఈ పరిస్థితుల్లో కూటమి పెద్దలు డిఫెన్స్ లో పడ్డారు. ఆ విమర్శలను వంగవీటి రాధాకృష్ణ ద్వారా తిప్పి కొట్టాలని భావిస్తున్నారు. త్వరలో ఖాళీ కాబోయే ఎమ్మెల్సీ పదవుల్లో ఒకటి వంగవీటి రాధాకృష్ణకు కేటాయిస్తారని తెలుస్తోంది. అంతటితో ఆగకుండా ఆయనను క్యాబినెట్ లోకి తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. మొత్తానికైతే వంగవీటి వారసుడికి ఎట్టకేలకు పవర్ పాలిటిక్స్ చిక్కుతాయన్నమాట.

# బిజెపిలో 'పొత్తు' కలకలం!

జనతా పార్టీ. అందుకు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే గతం మాదిరిగా దూకుడు ప్రదర్శించలేకపోతోంది. ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ఎంపీలను పిలిచి క్లాస్ పీకినట్లు కూడా వార్తలు వచ్చాయి. అయినా సరే బిజెపి నేతల వైఖరిలో ఎటువంటి మార్పు రావడం లేదు. గతం మాదిరిగా దూకుడు ప్రదర్శించడం లేదు. పైగా లేనిపోని వ్యాఖ్యలు చేసి పార్టీని అడ్డంగా బుక్ చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ బిజెపిపై ఒక విమర్శ తరచూ చేస్తోంది. గులాబీ పార్టీతో బిజెపిది ఫెవికాల్ బంధం అంటూ ఆరోపిస్తోంది. అది ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో బిజెపి ఎమ్మెల్యే పైడి కౌశిక్ రెడ్డి చేసిన కామెంట్స్ బిజెపికి భారీగా డామేజ్ చేస్తున్నాయి.

### సార్వత్రిక ఎన్నికల తర్వాత..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత రకరకాల విమర్శలు తెరపైకి వచ్చాయి. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ అధికారం పై మమకారం పెంచుకుంది. కానీ గులాబీ పార్టీతో బిజెపితో పొత్తు ఊహాగానాలు కాషాయ పార్టీని దెబ్బతీసాయి. అంతిమంగా అది కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చింది. అయితే సార్వత్రిక ఎన్నికల్లో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయింది. కనీసం ఒక్క ఎంపీ సీటు కూడా రాలేదు. భారతీయ జనతా పార్టీ మాత్రం అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా 8 ఎంపీ స్థానాలను దక్కించుకుంది. అప్పటినుంచి మరింత కొత్త చర్చ మొదలయ్యింది. గులాబీ పార్టీ కచ్చితంగా బిజెపితో పొత్తు పెట్టుకున్న ప్రచారం తెలంగాణ పొలిటికల్ సర్కిల్ లో పతాక స్థాయికి చేరింది. అయితే పొత్తుతో క్షేత్రస్థాయిలో బలపడవచ్చు అన్నది బిజెపిలో కొందరి అభిప్రాయం. కానీ కెసిఆర్ పార్టీ పై ఉన్న వ్యతిరేకత బిజెపి పై ప్రతాపం చూపి కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చుతుందనేది మరో అంచనా.

### పొలిటికల్ గా డ్యామేజ్..

గత కొంతకాలంగా తెలంగాణ బిజెపి నేతలు చాలా జాగ్రత్త పడ్డారు. తమ పార్టీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదు అని తేల్చి చెప్పారు. పొలిటికల్ డామేజ్ కంట్రోల్ లో భాగంగా ఆ పార్టీ నేతలు అలా ప్రకటనలు చేస్తూ వచ్చారు. కానీ బిజెపిలో ఉండి గులాబీ పార్టీపై అభిమానంతో ఉండే నేతలు మాత్రం భిన్న వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ తరుణంలోనే బిజెపికి చెందిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి కౌశిక్ రెడ్డి గులాబీ పార్టీతో బిజెపి పొత్తు పెట్టుకుంటే తప్పు ఏంటని ప్రశ్నించారు. ఏపీలో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుంటే తప్పులేదు.. ఇక్కడ పెట్టుకుంటే తప్ప అని వ్యాఖ్యానించారు. అయితే ఇప్పటికే గులాబీ పార్టీతో తమ పార్టీకి పొత్తు లేదు అని రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. అటువంటప్పుడు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఎలా ప్రకటిస్తారు అనేది ఇప్పుడు కొత్త వాదన. బిజెపి హై కమాండ్ కూడా దీనిపై సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో జిల్లా పరిషత్,మండల పరిషత్ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా ఈ వ్యాఖ్యలు పొలిటికల్ గా ఇబ్బంది పెడతాయని బిజెపి హై కమాండ్ భావిస్తోంది. అందుకే దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. రాష్ట్ర బిజెపి ఇంచార్జ్ కూడా దీనిపై దృష్టి పెట్టినట్లు సమాచారం. బిఆర్ఎస్ తో తమ పార్టీ పొత్తు పెట్టుకోదు అని బిజెపి హై కమాండ్ ఒక ప్రకటన జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.






**భారతదేశం నేడు ఒక చారిత్రాత్మక మలుపులో ఉంది. ఒకవైపు ఆకాశహర్మ్యాలు, మెట్రో రైళ్లు, అత్యాధునిక షాపింగ్ మాల్స్‌తో మన నగరాలు ప్రపంచ పటంలో మెరుస్తుంటే, మరోవైపు అదే నగరాల గుండెల్లో పేదరికం నిశ్శబ్దంగా వేళ్లూనుకుంటోంది. 21వ శతాబ్దపు భారతదేశంలో నగరీకరణ అనేది కేవలం భౌగోళిక మార్పు మాత్రమే కాదు, అది ఒక సామాజిక విస్ఫోటనం.**

# నగరాలు పెరుగుతున్నాయి.. కానీ పేదరికం ఎందుకు తగ్గడం లేదు?



గత రెండు దశాబ్దాలుగా మన నగరాలు అద్భుతమైన పరివర్తనకు సాక్ష్యమిచ్చాయి. కానీ, ఈ 'స్మార్ట్' వెలుగుల వెనుక దాగిన 'మురికి' వాస్తవాలను మనం విస్మరించలేం. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 31.16 శాతం ప్రజలు నగరాల్లో నివసిస్తుండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 35 శాతం దాటిందని అంచనా. 2030 నాటికి మన దేశ జనాభాలో సుమారు 40 శాతం మంది నగరవాసులుగా మారుతారని గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాలు గ్లోబల్ హబ్‌లుగా అవతరించాయి. అయితే, ఈ గణాంకాల వెనుక ఒక భయంకరమైన సత్యం ఉంది. నగరాలకు వలస వచ్చే వారిలో మెజారిటీ ప్రజలు ఉపాధి కోసం వచ్చే అసంఘటిత రంగ కార్మికులే. వీరు నగర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నప్పటికీ, నగర ఫలాలను మాత్రం అందుకోలేకపోతున్నారు. నగరాల్లో నివసించడం నేడు ఒక విలాసంగా మారిపోయింది. ముఖ్యంగా మహానగరాల్లో మధ్యతరగతి ప్రజలే అద్దెలు కట్టలేక అల్లాడిపోతుంటే, ఇక పేదవారి పరిస్థితి వర్ణనాతీతం. ఒకప్పుడు నగరం అంటే అవకాశాల నిలయం, కానీ ఇప్పుడు అది ఖర్చుల నిలయంగా మారింది. గృహ అద్దెలు సామాన్యుడి ఆదాయంలో సగానికి పైగా హరిస్తున్నాయి. ఫలితంగా, పేద ప్రజలు మురుగు కాలువల పక్కన, రైల్వే ట్రాక్‌ల సమీపంలో అపరిశుభ్రమైన బస్తీల్లో నివసించాల్సి వస్తోంది. గ్రామాలతో పోలిస్తే నగరాల్లో నిత్యావసర వస్తువుల ధరలు చాలా ఎక్కువ. రవాణా ఖర్చులు, విద్యుత్ బిల్లులు కలిపితే నెలాఖరుకు చేతిలో చిల్లిగవ్వ మిగలని పరిస్థితి ఏర్పడుతోంది. ఆధునిక నగరాలు జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ (ఖఅశీషశ్రీవసస్త్రవ జుషశీఅశీఎఎ) పై నడుస్తున్నాయి. ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు, మేనేజర్లకు లక్షల్లో జీతాలు లభిస్తాయి. కానీ, అదే నగరంలో భవన నిర్మాణ కార్మికుడు, సెక్యూరిటీ గార్డు, లేదా డెలివరీ బాయ్ చేసే శ్రమకు తగిన గుర్తింపు గానీ, వేతనం గానీ లభించడం లేదు. నేడు వేలమంది యువకులు డెలివరీ యాప్స్‌లో పనిచేస్తున్నారు. వీరికి సామాజిక భద్రత లేదు, ఇన్సూరెన్స్ లేదు, స్థిరమైన పని గంటలు లేవు. వీరు నగరానికి సేవ చేస్తున్నారు కానీ, నగర అభివృద్ధిలో భాగస్వాములు కాలేకపోతున్నారు. సరైన విద్య, శిక్షణ లేని వలస కార్మికులు తక్కువ వేతనానికి ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తోంది. ఇది వారిని పేదరికపు ఊబిలో మరింత లోతుకు తొక్కివేస్తోంది. నగరాల్లో భూమి ధరలు పెరగడం అభివృద్ధికి సూచిక అని భావిస్తారు, కానీ అది పేదవాడి సొంతింటి కలపై గొడ్డలి పెట్టుగా మారుతోంది. రియల్ ఎస్టేట్ రంగం కేవలం సంపన్నుల కోసం లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీల ను నిర్మిస్తోంది. అభివృద్ధి పేరుతో బస్తీలను తొలగించి, వారిని నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన ఇళ్లకు తరలిస్తున్నారు. దీనివల్ల వారి ఉపాధి దెబ్బతింటోంది. రవాణా ఖర్చులు పెరిగి వారు మరింత పేదరికంలోకి జారుకుంటున్నారు. చట్టబద్ధమైన గృహ వసతి లేకపోవడంతో పేదలు స్క్వాటర్ సెటిల్మెంట్స్ లో ఉంటున్నారు. వీరికి పట్టాలు లేకపోవడంతో ఎప్పుడు ఖాళీ చేయిస్తారో అన్న భయం వెంటాడుతూనే ఉంటుంది.

నగరాల్లో ప్రపంచస్థాయి కార్పొరేట్ ఆసుపత్రులు, అంతర్జాతీయ పాఠశాలలు ఉన్నాయి. కానీ అవి కేవలం ధనికులకే పరిమితం. పేదలు ఇప్పటికీ సౌకర్యాలు లేని ప్రభుత్వ ఆసుపత్రులపై, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలపైనే ఆధారపడుతున్నారు. బస్తీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల అంటువ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. ఒక చిన్న అనారోగ్యం పేద కుటుంబాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తోంది. కరోనా వంటి సమయాల్లో ఆన్‌లైన్ విద్య పేద పిల్లలకు అందని ద్రాక్షగా మారింది. ఇది భవిష్యత్తులో వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీసి, పేదరికాన్ని ఒక తరం నుండి మరో తరానికి బదిలీ చేస్తోంది. నగర పేదరికం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, అది సామాజిక విఘాతానికి దారితీస్తుంది. సంపన్నుల విలాసవంతమైన జీవితాలను దగ్గరుండి చూస్తున్న బస్తీ యువతలో ఒక రకమైన అసహనం, నిరాశ పెరుగుతోంది. ఇది వారిని నేరాల వైపు లేదా మాదకద్రవ్యాల వైపు మళ్లేలా ప్రేరేపిస్తోంది. ఒకే నగరంలో రెండు వేర్వేరు ప్రపంచాలు ఉండటం సామాజిక సామరస్యానికి ప్రమాదకరం. నగరాలు కేవలం యంత్రాలు కావు, అవి మనుషుల జీవన కేంద్రాలు. నిజమైన నగరీకరణ అంటే మురికివాడలు లేని నగరం కాదు, పేదరికం లేని నగరం. నగర మాస్టర్ ప్లాన్‌లలో పేదల గృహ వసతికి కనీసం 20-25 శాతం స్థలాన్ని కేటాయించాలి. వారు పనిచేసే చోటుకు సమీపంలోనే తక్కువ అద్దెకు ఇళ్లు ఉండాలి. ప్రభుత్వాలు కేవలం ఐటీ రంగంపైనే కాకుండా, అసంఘటిత రంగ కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి అర్బన్ స్కిల్ సెంటర్స్ ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+ూూ) మాదిరిగా నగరాల్లో కూడా పేదలకు కనీస పని దినాలు కల్పించే చట్టం రావాలి. చౌకైన మరియు వేగవంతమైన ప్రజా రవాణా వ్యవస్థ ఉంటేనే పేదలు తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించి ఉపాధి పొందగలరు. కేవలం ప్రభుత్వాలు మాత్రమే ఈ మార్పును తీసుకురాలేవు. కార్పొరేట్ సంస్థలు తమ జూ= నిధులను కేవలం మొక్కలు నాటడానికో, పెయింటింగ్‌లు వేయడానికో కాకుండా, బస్తీల్లో నాణ్యమైన విద్య, వైద్యం అందించడానికి వెచ్చించాలి. పౌరులుగా మనం కూడా మన ఇళ్లలో, ఆఫీసుల్లో పనిచేసే వారి పట్ల మానవత్వంతో వ్యవహరించాలి. వారికి కనీస వేతనం అందించడం మన బాధ్యతగా గుర్తించాలి. నగరాల ప్రగతిని మనం కేవలం జిడిపి (+ఱూ) అంకెల్లోనో, ఫ్లైఓవర్ల పొడవులోనో కొలవకూడదు. ఆ నగరంలో చిట్టచివరి వరుసలో ఉన్న పేదవాడు ఎంత గౌరవంగా బతుకుతున్నాడు అనేదే నిజమైన అభివృద్ధికి కొలమానం. భారత దేశం వికసిత్ భారత్ గా మారాలంటే, మన నగరాలు సంపదను సృష్టించడమే కాదు, ఆ సంపదను అందరికీ సమానంగా పంచే వేదికలుగా మారాలి. నగరీకరణ ఒక శాపం కాకూడదు, అది ప్రతి భారతీయుడికి ఒక ఉజ్వల భవిష్యత్తును ఇచ్చే వరం కావాలి. అప్పుడే మన నగరాలు నిజమైన వెలుగులను నింపుకుంటాయి.


**డా .సూర్యదేవర రామకృష్ణ ,**

**9490754169**


## పడి లేచిన కెరటం..

# తెలుగుదేశం!

తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారు. 1982 మార్చి 29న హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో పార్టీని ప్రకటించారు. పరిమిత సంఖ్యలో నాయకులతో మీడియా సమావేశం ఏర్పాటు చేసి పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన చేశారు. సినిమా వాడు ఏం చేస్తాడులే అంటూ తేలిగ్గా తీసుకుంది జాతీయ కాంగ్రెస్ పార్టీ. కానీ 9 నెలల అనతి కాలంలోనే అధికారంలోకి వచ్చి ప్రభంజనం సృష్టించింది తెలుగుదేశం పార్టీ. తెలుగుదేశం పార్టీ పిలుస్తోంది రా కదలిరా అంటూ నాడు ఎన్టీఆర్ ఇచ్చిన పిలుపునకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎన్టీఆర్ ప్రభంజనంలో కాంగ్రెస్ పార్టీలో యోధాను యోధులు మట్టికరిచారు. అంతులేని మెజారిటీతో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించింది.

**నాయకులను తయారు చేసే ఫ్యాక్టరీగా..**

తెలుగుదేశం పార్టీ నాయకులను తయారు చేసే ఫ్యాక్టరీగా మారింది. కెసిఆర్ నుంచి రేవంత్ రెడ్డి వరకు.. ఎర్రం నాయుడు నుంచి దేవేందర్ గౌడ్ వరకు.. పరిటాల రవి నుంచి బాబు మోహన్ వరకు.. ఇలా చెప్పుకుంటూ పోతే వందలాదిమంది నాయకులను జాతికి అందించింది తెలుగుదేశం పార్టీ. బడుగుల నాయకత్వాన్ని ప్రోత్సహించిన చరిత్ర టిడిపిది. అప్పటివరకు నాయకత్వం అంటే అగ్రవర్ణాలది. కానీ టిడిపి ప్రవేశంతో స్వరూపమే మారిపోయింది. ఎంతోమంది నేతలకు రాజకీయ జీవితం అందించింది తెలుగుదేశం పార్టీ. అందుకే టిడిపిని ఏ నేత కూడా మరువరు. అవసరాల కోసం పార్టీ మారిన వారు సైతం టిడిపి పట్ల కృతజ్ఞతా భావంతోనే ఉంటారు.

**అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ..**

ఒక ప్రాంతీయ పార్టీ నాలుగు దశాబ్దాలకు పైగా మన గలగడం అంటే సామాన్య విషయం కాదు. అటువంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది తెలుగుదేశం పార్టీ. ఎన్టీఆర్ టిడిపికి బలమైన పునాదులు ఏర్పాటు చేశారు. కానీ దాని నిర్మాణం చంద్రబాబు చేపట్టారు. ఆ ఇద్దరు నేతలు నిర్మించిన టిడిపి ఇప్పటికి చెక్కుచెదరలేదు. పడిపోయిన ప్రతిసారి ఆ పార్టీ పైకి లేస్తూనే ఉంది. 1983, 1985లో ఘన విజయం సాధించింది టిడిపి. కానీ 1989 ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. ఆ ఓటమిని గుణపాఠాలుగా మార్చుకుంది తెలుగుదేశం. రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి 1994 ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. కానీ అక్కడకు ఏడాదికే టిడిపిలో సంక్షోభం ఏర్పడింది. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు చేతికి పార్టీ పగ్గాలు వచ్చాయి. వెన్నుపోటు అనే విమర్శను ఎదుర్కొన్నారు చంద్రబాబు. కానీ అదే తెలుగుదేశం పార్టీని 1999 ఎన్నికల్లో విజయతీరాలకు చేర్చారు చంద్రబాబు. 2004లో మాత్రం చంద్రబాబు నాయకత్వంలో టిడిపి ఓడిపోయింది. 2009లో సైతం రెండోసారి ఓటమి తప్పలేదు. దీంతో టీడీపీ పని అయిపోయిందని భావించిన తరుణంలో 2014లో నవ్యాంధ్రప్రదేశ్లో జరిగిన ఎన్నికల్లో టిడిపిని గెలిపించారు రాష్ట్ర ప్రజలు.. 2019లో దారుణ పరాజయం ఎదురయింది. అయినా సరే సహనంతో,దీక్షతో, పట్టుదలతో చంద్రబాబు మరోసారి తెలుగుదేశం పార్టీని విజయ తీరాల వైపు చేర్చారు. అయితే అప్పటికీ ఇప్పటికీ టిడిపి నిలబడింది అంటే క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ఉన్న సైన్యమే. అయితే తెలుగు నేల ఉన్నంతవరకు.. తెలుగుదేశం పార్టీకి తిరుగులేదు అన్నట్టు ఉంది.. నిజంగా ఇది గొప్ప విషయం.

# మట్టిలో మాణిక్యాలను వెలికితీసేలా క్రీడా పాలసీ


**(మొదటి పేజీ తరువాయి)**


సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎల్బీ స్టేడియంలో శనివారం స్పోర్ట్స్ మీట్-2026ని సీఎం రేవంత రెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మంత్రి జూపల్లి ఆ జ్యోతితో మైదానంలో రన్ లో పాల్గొని మిగతా సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు ప్రతిపక్ష నాయకులు క్రీడలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారని, అదేం క్రీడా స్ఫూర్తో తనకు అర్థం కావడం లేదని విమర్శించారు. రాజకీయాలకతీతంగా మైదానంలో క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తే.. భవిష్యత్తు తరాలు క్రీడా స్ఫూర్తితో కలిసిమెలిసి ఉండే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి కనుమరుగైందని, క్రీడలంటే ఎలా ఉంటాయని వెతుక్కునే పరిస్థితి దాపురించిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని, ప్రపంచ స్థాయిలో పరిణామాలు, వివిధ క్రీడలు, క్రీడాకారులు, శిక్షణకు ప్రత్యేక సలహాదారుడ్ని ఏర్పాటు చేశామని తెలిపారు. స్పోర్ట్స్ పాలసీతో మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

**మెస్సీని కాకుండా డ్రగ్స్ కింగ్‌ను పిలవాలా!?**

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని నగరానికి తేవడంతో రాష్ట్ర ఖ్యాతి ప్రపంచానికి తెలిసిందని, కానీ, ప్రతిపక్షాల తీరు చూస్తుంటే మెస్సీని కాకుండా డ్రగ్స్ కింగ్‌ను పిలవాలన్నట్లు ఉందని సీఎం రేవంత్రెడ్డి మండిపడ్డారు. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ.. నిరంతరం సమస్యలను పరిష్కారించాలనే ఆలోచనలతో ప్రజా జీవితంలో ఉండే వారికి స్ఫూర్తి, విశ్రాంతినిచ్చేందుకే బడ్జెట్ సమావేశాల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉండేదని, ఎన్నో అంతర్జాతీయ క్రీడలు నిర్వహించారని, రాష్ట్రం క్రీడల రాజధానిగా రాణించిందని, ఆ తర్వాత వివిధ కారణాల వల్ల క్రీడలు, అంతర్జాతీయ పోటీల నిర్వహణ తగ్గుతూ పోయిందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఒలింపిక్స్‌లో పతకాల సంగతి దేవుడెరుగు ఎంట్రీ లెవెల్‌లోనే అర్హత సాధించలేకపోతున్నామని సీఎం రేవంత రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "గచ్చిబౌలిలో ఉన్న 70 ఎకరాల క్రీడా మైదానాల్ని రూ.700 కోట్లతో ప్రపంచ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేస్తాం. 2034లో ఒలింపిక్స్ అక్కడ నిర్వహించేలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. మూడు నెలల్లో పనులు ప్రారంభించి మూడు సంవత్సరాల్లో అభివృద్ధి చేస్తాం"



అని ప్రకటించారు. రాజకీయ కార్యక్రమాలకే పరిమితమైన ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, అద్భుత

## ఫుట్‌బాల్‌లో సీఎం.. కబడ్డీలో సత్తా చాటిన మంత్రి

క్రీడా పోటీల్లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు చురుగ్గా పాల్గొని ఆయా క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫుట్‌బాల్ మ్యాచలో ఐదు గోల్స్‌తో సీఎం జట్టు విజయం సాధించగా.. అత్యధికంగా నాలుగు గోల్స్‌ను సీఎం రేవంత్ రెడ్డి చేశారు. కబడ్డీలో క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి ఒక్కరే 15 పాయింట్లు సాధించి సత్తా చాటారు. మహిళా సభ్యులకు ప్రత్యేకంగా నిర్వహించిన లెమన అండ్ స్పూన గేమ్‌లో మంత్రి కొండా సురేఖ విజయం సాధించారు. ఫుట్ బాల్, కబడ్డీ ఆటల సందర్భంగా పలువురు సభ్యులు కిందపడ్డా.. తిరిగి లేచి నిలబడి ఎంతో చురుగ్గా పోటీల్లో పాల్గొన్నారు. తాము, జట్టు పాయింట్లు సాధించిన సమయంలో ఆనందంగా గంతులేశారు. కాగా క్రీడా పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం రెండో రోజు శాసన సభ్యుల క్రీడా పోటీలు కొనసాగుతాయి.

# అంతా రేవంత్ 'హస్తం'

మాజీ మంత్రి, సీనియర్ నేత చిన్నారెడ్డి సైతం పార్టీకి గుడ్ బై చెబుతారని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అందుకు కూడా రేవంత్ తీరు కారణమంటూ కొత్త లెక్కలు తెరపైకి వస్తున్నాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా 15 మంది సీనియర్లను పార్టీ నుంచి పంపించేందుకు.. పొమ్మనలేక పొగ పెడుతున్నారు అనేది పొలిటికల్ వర్గాల వాదన.

**మునుపటిలా లేదు పరిస్థితి..**

అయితే రేవంత్ ప్రత్యేక వ్యూహం పన్ని సీనియర్లను పంపిస్తున్నారా? అనే మాటను తప్పిస్తే.. మునుపటి మాదిరిగా కాంగ్రెస్ పార్టీలో వ్యవహారాలు నడవడం లేదు. గతంలో సీనియర్లు స్వేచ్ఛగా మాట్లాడేవారు. ఏఐసీసీ వద్ద తమ పరపతిని ఉపయోగించి నామినేటెడ్ పదవులు దక్కించుకునేవారు. రాజ్యసభ తో పాటు ఎమ్మెల్సీ పదవులను పొందేవారు. నచ్చిన మంత్రిత్వ శాఖను తెచ్చుకునేవారు. కానీ రేవంత్ వచ్చిన తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆయన చేతిలో పార్టీ పూర్తిగా వచ్చింది. ఆయన చెప్పిన వారికే పదవులు. సూచించిన వారికి కొలువులు అన్నట్టు పరిస్థితి మారింది. తన సన్నిహితులు వేం నరేందర్ రెడ్డి కి రాజ్యసభ పదవి ఇప్పించుకోవడం ద్వారా ఇక సీనియర్ల పని అయిపోయిందని సంకేతాలు పంపించగలిగారు రేవంత్ రెడ్డి. ఇది ఎంత మాత్రం సీనియర్ కాంగ్రెస్ నాయకులకు రుచించడం లేదు.. అందుకే పార్టీలో ఒక్కొక్కరు ఇప్పుడు బయట పడుతున్నారు.

**కొత్త ఆరోపణలు..**

కాంగ్రెస్ సీనియర్లు ఇప్పుడు కొత్త కామెంట్స్ రేవంత్ పై వినిపించడం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ మాదిరిగా కాంగ్రెస్ ను కూడా సర్వనాశనం చేస్తారని దాని సారాంశం. తెలుగుదేశం పార్టీలో తాను ఎదిగేందుకు రేవంత్ నాగం జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మోత్కుపల్లి నరసింహులు, మల్లారెడ్డి లాంటి నేతలను బయటకు పంపించారని ఇప్పుడు కాంగ్రెస్ సీనియర్లు ఆరోపిస్తున్నారు. అదే మాది కాంగ్రెస్ పార్టీని మార్చేస్తారని ఆరోపణలు చేస్తున్నారు. కానీ తెలుగుదేశం పార్టీ నాయకత్వం కానీ.. ఆ పార్టీ శ్రేణులు కానీ.. అలా అనుకోవడం లేదు. ఓటుకు నోటు కేసులో రేవంత్ దొరికిపోయారు. ఆ సమయంలో ఎన్ని రకాల ఒత్తిళ్లు ఎదురైనా చంద్రబాబు పట్ల విధేయత కనబరిచారు. ఒక ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఆయన టిడిపికి గుడ్ బై చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా చేరిన క్రమంలో ఒక్కసారి కూడా తెలుగుదేశం పార్టీని కానీ.. చంద్రబాబు నాయకత్వాన్ని కానీ ఎప్పుడూ వ్యతిరేకించలేదు.

**అన్ని అనుకూలతలు సాధిస్తూ..**

రేవంత్ రెడ్డి ఒక వ్యూహాత్మక రాజకీయ చదరంగం ఆడుతున్నారు. ఆయన రాజకీయ అడుగులు చూస్తే ఇట్టే అర్థమయిపోతుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రత్యేక పరిస్థితుల్లో ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు తీసుకున్నారు. అలా పదవి ప్రమాణం చేసిన నాటి నుంచి రేవంత్ రెడ్డి పై హై కమాండ్ కు ఫిర్యాదులు వెళుతూనే ఉన్నాయి. అదిగో రేవంత్ తొలగింపు.. ఇదిగో రేవంత్ తొలగింపు అంటూ ప్రచారం చేశారు. కానీ ఏం జరగలేదు. ఆపై హై కమాండ్ వద్ద తన పట్టు పెంచుకుంటూ వస్తున్నారు. తెలంగాణ విషయంలో రేవంత్ ముద్ర లేకుండా ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేని స్థితికి ఏఐసీసీ చేరింది. ఒక్క మాటలో చెప్పాలంటే 2029 ఎన్నికల్లో రేవంత్ సీఎం అభ్యర్థిగానే రంగంలోకి దిగుతారు. అందుకు కాంగ్రెస్ పార్టీ కూడా ఒప్పుకోక తప్పదు. ఎందుకంటే జాతీయస్థాయిలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. రాహుల్ ప్రధాని కావాలి. అందుకు అవసరమైన బలాన్ని తెలంగాణ నుంచి పొందాలి. అలా పొందాలి అంటే సీనియర్ల మాటలు కంటే.. సీఎం రేవంత్ వైపే మొగ్గు చూపే పరిస్థితి కనిపిస్తోంది. సో కాంగ్రెస్ పార్టీ సీనియర్లు మరోసారి వెనక్కి తగ్గక తప్పని పరిస్థితి. ఉంటే కాంగ్రెస్ తో కొనసాగాలి. రేవంత్ రెడ్డితో సంధి చేసుకోవాలి. అంతకుమించి వారికి వేరే ఆప్షన్ కూడా లేదు.

## ఎల్బీ నగర్ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కంటే

# చలాన్ల వసూళ్ల పైనే దృష్టి..!







**ట్రాఫిక్ నియంత్రణను వదిలేసి, రోడ్ల మూలల్లో నక్కి ఫోటోలు తీయడం**

**వాహనాలను ఆపి గంటల తరబడి వేచి ఉండేలా చేయడం**

**ప్రజలను వేధించడం ఆపి, మిత్ర పోలీసులా వ్యవహరించాలి**

**సామాన్య వాహనదారుల ఆవేదన..!**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ స్టేట్ బ్యూరో: హైదరాబాద్ లోని ఎల్ బి నగర్ లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కంటే చలాన్ల వసూళ్ల పైనే ట్రాఫిక్ పోలీసులు ఎక్కువ దృష్టి పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య వాహనదారుల అభిప్రాయం ప్రకారం... హైదరాబాద్ ఎల్బీ నగర్ ట్రాఫిక్ పోలీసులు తరచుగా ట్రాఫిక్ నియంత్రణను పక్కనపెట్టి, రోడ్ల మూలల్లో నక్కి లేదా నిలిచిన వాహనాలను ఫోటోలు తీయడం పైనే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. సామాన్య వాహనదారులను టార్గెట్ చేస్తూ, నిబంధనల పేరుతో భారీగా జరిమానాలు విధిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాహన పత్రాలు అడిగే క్రమంలో కొంతమంది పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, కనీస గౌరవం ఇవ్వడం లేదని వాహనదారులు ఆరోపణలు చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణను వదిలేసి, రోడ్ల మూలల్లో నక్కి ఫోటోలు తీయడం, వాహనాలను ఆపి గంటల తరబడి వేచి ఉండేలా చేయడంపై వాహనదారులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్లను రీచ్ అవ్వడానికే ఇలా చేస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు. నగరంలో సరైన పార్కింగ్ సౌకర్యాలు కల్పించకుండా, రోడ్డు పక్కన కాసేపు ఆపిన వాహనాలను, పెట్రోల్ కోసం బంక్ లోకి వెళ్తున్న వాహనాలను అపి రాంగ్ రూట్ లో వస్తున్నావు అంటూ వారికీ ఇష్టం వచ్చినట్లు జరిమానాలు వేస్తూ అదనపు భారం మోపుతున్నారని జనం వాపోతున్నారు. కొన్ని చోట్ల సిగ్నల్స్ సరిగ్గా పని చేయకపోయినా, పొరపాటున ముందుకు వెళ్లిన వారిపై కూడా కనికరం లేకుండా కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొన్నిసార్లు పాత చలాన్ల గురించి తెలియకపోవడం వల్ల వాహనదారులు భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇది వారిపై ఆర్థిక భారాన్ని పెంచుతుంది. "జరిమానాలు విధించడం తప్పు కాదు, కానీ అది కేవలం ఆదాయ వనరుగా మారకూడదు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంపై, రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలి. ప్రజలను వేధించడం ఆపి, మిత్ర పోలీసులా వ్యవహరించాలి" అని వాహనదారులు కోరుతున్నారు.



## ఈదులగూడెం అంగన్వాడీలో శిశువులకు అన్నప్రాసన

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 28:** మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే (ఈసీసీఈడే) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సీడీపీఓ రేఖల మమత ఆదేశాల మేరకు ఇస్లాంపూర్ సెక్టర్‌లోని ఈదులగూడెం అంగన్వాడీ కేంద్రం--3లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రంలో కొత్తగా చేరిన శిశువులకు సంప్రదాయంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ బొందు పార్వతి మాట్లాడుతూ, 3--6 సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రీ-స్కూల్ విద్య అందిస్తున్నామని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా బోధన నిర్వహిస్తున్నామని వివరించారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, అక్కడ అందించే సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎం. లలితమ్మ, సిహెచ్. రామానుజమ్మ, రజిత, హెల్పర్లు ఆసియా బేగం, వి. లక్ష్మి, బి. లక్ష్మి, పార్వతమ్మతో పాటు ప్రీ-స్కూల్ పిల్లల తల్లిదండ్రులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## చౌటుప్పల్లో "స్వర్గపురి" వాహనాలను పెంచాలి

### 12వ వార్డు కౌన్సిలర్ పాకా చిరంజీవి యాదవ్



**చౌటుప్పల్, మార్చి 28, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో శనివారం 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి యాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. స్వర్గపురి వాహనం చౌటుప్పల్ మున్సిపాలిటీ మొత్తంలో ఒక్కటే వాహనం ఉండడం వలన 20 వార్డులలో ఒకే రోజు ఇద్దరూ లేదా ముగ్గురు అనుకోకుండా కాలం చేస్తే వారి దహన సంస్కారాలు చేయాలంటే ఉన్న ఒక్క వాహనంతో ఇబ్బంది కలుగుతున్నదని కాబట్టి చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఇంకో స్వర్గపురి వాహనం మంజూరు చేయవలసినదిగా మునిసిపల్ చైర్మన్ మగుదల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ లను కోరారు. అలాగే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి షాపులకు, ఇండ్లకు యూజింగ్ అండ్ డ్రింకింగ్ వాటర్ పైప్ లైన్ సౌకర్యం లేనందువలన తక్షణమే అమృత్ స్కీం కింద ఏర్పాటు చేయవలసిందిగా సమావేశంలో వారు కోరారు.

## మోటార్‌సైకిల్ ఢీకొని మనవరాలు మృతి.. అవ్వకు తీవ్ర గాయాలు



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 28:** మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని బాలిక మృతి చెందగా, వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. గ్రామ సెంటర్ వద్ద నార్కెట్‌పల్లి--అద్దంకి స్టేట్ హైవేపై శుక్రవారం జరిగిన ఈ ఘటనలో బెజవాడ చంద్రమ్మ (60) తన మనవరాలు బెజవాడ చందన (10)తో కలిసి రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. అదే సమయంలో వాడపల్లి వైపు నుంచి మిర్యాలగూడ వైపుకు వెళ్తున్న టీఎస్ 08 జెఎన్ 0545 నంబర్ మోటార్‌సైకిల్‌ను నడుపుతున్న వ్యక్తి అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చంద్రమ్మకు కుడికాలు విరగగా, చందనకు ఎడమ కాలు విరిగి లోపల తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే వారిని చికిత్స కోసం మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చందన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ నెల 27న మధ్యాహ్నం 12.50 గంటలకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు రూరల్ ఎస్ఐ ఎం. లక్ష్మయ్య శనివారం వెల్లడించారు.

# సమభావన సంఘం నిధులు గోల్‌మాల్.. వీఓఏలో చేతివాటం

### సంఘం నిధులు వివోఏ ల సొంత అవసరాలకు వినియోగం



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న సమభావన సంఘాల నిధుల వినియోగంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. సంఘానికి సంబంధించిన నిధులను సరైన విధంగా వినియోగించకుండా గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామ స్థాయి కీలక పాత్ర పోషించిన వీఓఏలు అక్రమాలకు పాల్పడ్డారని జరిగాయని సమభావన సంఘాలు ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘం సభ్యులకు వివిధ రకాల రుణాలు డబ్బులు పూర్తిగా అందకపోవడం, ఖాతాల్లో లెక్కలు సరిపోకపోవడం వంటి విషయాలు బయటపడుతున్నాయి. కొన్ని చెల్లింపులు రికార్డుల్లో ఉన్నప్పటికీ, వాటి ప్రయోజనం సభ్యులకు అందలేదని సమాచారం. దీంతో నిధుల దుర్వినియోగంపై సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రస్తుతం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. అధికారులు తనిఖీ లో వచ్చిన అవినీతి ఆరోపణలు పై ఎలాంటి విషయాలు బహిర్గతం చేయటం లేదు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే పారదర్శకంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమబావన సంఘాలు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంఘాల నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోని రికవరీ చేయాలని కోరుతున్నారు.

## జుల్కల్ గ్రామంలో విషాద ఘటన: ఇద్దరు చిన్నారులతో పాటు తల్లి మృతి





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మార్చి 28:** సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్కల్ గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ తన ఇద్దరు చిన్నారులతో కలిసి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు మమతగా గుర్తించారు. ఆమె భర్త పట్నం ప్రవీణ్ గత జనవరి నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో, మమత తీవ్ర మానసిక వేదనలో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఆమె తన ఇద్దరు చిన్నారులను గొంతు నులిమి హత్య చేసి, అనంతరం ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ సంఘటనా స్థలానికి చేరుకుని, క్లూ టీమ్స్ సహాయంతో ఘటనపై సమగ్రంగా పరిశీలించారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అసలు మరణ కారణాలపై నివేదిక అనంతరం స్పష్టత రానుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రజలు మానసిక సమస్యలను ఒంటరిగా భరించకుండా కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పంచుకోవాలని పోలీసులు సూచించారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

**రాజీ పడదానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో రాజీ పడవచ్చు**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్**

**ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం**

**జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి**




**ఖమ్మం( క్రైమ్ మిర్రర్ బ్యూరో):** రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో రాజీతో ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు, సుప్రీంకోర్ట్ తుది తీర్పుతో సమానమని అన్నారు. లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చుని ఆయన తెలిపారు.కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కుటుంబ వివాదాల కేసులలో ముఖ్యమైనవి భార్యాభర్తల కేసుల వివాదాలలో ఇద్దరు కలిసి ఉంటే, వారి సంతానంతో పాటు ఇరువర్గాల కుటుంబాలు కూడా సుఖ సంతోషాలతో ఉండి, ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు.గత లోక్ అదాలత్ లో 8490 కేసుల పరిష్కారం చేసి తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా 6వ స్థానంలో నిలిచిందన్నారు. ఇందులో 63 మోటారు వాహన ప్రమాదాల కేసులు పరిష్కరించి, 4 కోట్ల 28 లక్షల 98 వేల రూపాయలు పరిహారం క్రింద అందించామని ప్రధాన నాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంలో జిల్లా ఇంకా మెరుగైన స్థానం సాధించాలన్నారు. ఇందుకు భాగస్వాములందరూ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణం తో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, భేషజాలకు పోకుండా, ఇరువర్గాల గెలుపు లోక్ అదాలత్ లో ఉంటుందని అన్నారు. పగ, ద్వేషం, కక్ష, ప్రతీకారం ఉంచుకోవద్దని, మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని, శత్రువునైనా ప్రేమించే తత్వం అలవర్చుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో మోటార్ వాహన కేసుకు సంబంధించి ఇన్స్యూరెన్స్ కంపెనీ నుండి ప్రమాద మరణానికి సెటిల్ మెంట్ కు సంబంధించి, ఫ్యామిలీ కేసుకు సంబంధించి పరిష్కారం చేసి, అవార్డు తోపాటుపూల మొక్కలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బహుకరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయ సేవా సదన్ ఇంచార్జ్ కార్యదర్శి కల్పన, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, మీడియేటర్స్, న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ హిత సమాజాన్ని నిర్మిద్దాం

**కోదాడ మార్చి 28 క్రైమ్ మిర్రర్:** స్థానిక కె.ఆర్.ఆర్ .ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోదాడలో ఎకోక్లబ్ ఆధ్వర్యంలో ఈరోజు ఆర్గానిక్ ఫుడ్ పెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.హదాస రాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణ గారు హాజరై మాట్లాడుతూ మానవులంతా ప్రకృతికి దగ్గరగా జీవించాలని ప్రతిఒక్కరు మొక్కలు పెంచాలని, నీటిని వృథా చెయ్యొద్దని బావితరాలకు కాలుష్యం లేని సమాజాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిమీద ఉందని ప్రసంగించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆర్మీ ఫోర్స్ అధికారి శ్రీరామ్ మరియు ఉస్మానియా యూనివర్సిటీ నుండి ్రాణ పరిశోధకుడు గోపాల్ పాల్గొన్నారు. అదేవిధంగా ప్రముఖ సాహితీ వేత్త కృష్ణమూర్తి పాల్గొన్నారు.కళాశాల విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పర్యావరణ రహిత వస్తువులను, ఆహార పదార్థాలను ప్రదర్శించారు. గాలిని నీటిని నిప్పును అడవులను రక్షించాలని విద్యార్థులు వివిధ పర్యావరణ రహిత ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మరియ ఎకో క్లబ్ కన్వీనర్ చందా అప్పా రావు మాట్లాడుతూ ప్రకృతి ఇచ్చిన ఆహారాన్ని మనిషి ఆధునికత పేరుతో ధ్వంసం చేస్తున్నాడని కాపాడుకోవలసి న భాధ్యత మనందరిమీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి సైదిరెడ్డి, నాగిరెడ్డి, నిర్మలా కుమారి ఫ్రాన్సిస్, జి సైదులు వెంకటేశ్వర రెడ్డి, శ్రీలత, పల్లెపాటి సైదులు, ఎస్ ఎం రఫీ, ఆకుల రాజు, కే సైదులు రాజు సైదమ్మ, సుమలత శ్రీలక్ష్మి, మల్లయ్య అధ్యాప కేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి దిశగా సంస్థాన్

**సిసి రోడ్లు పనుల నాణ్యత పరిశీలిస్తున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి**

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 28(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఒకటో వార్డులో సిసి రోడ్ పనుల నాణ్యత పరిశీలిస్తు నారాయణపురని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్తున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఈ కార్యక్రమంలో 1వ వార్డు మెంబర్ బల్గూరి శివ, 13వ వార్డు మెంబర్ సింగపంగా ప్రశాంతి రమేష్, పల్లె సీతారాం రెడ్డి, చిలుకూరి శ్రీను , క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, భూపని బలరాం, విడం వెంకటేశం, బద్దుల యాదయ్య , మేకని శ్రీను, దోర్నాల అంజయ్య, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడు రాజారావు మృతి



**గండిపేట(క్రైం మిర్రర్):** ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించిన ప్రముఖ ఉపాధ్యాయులు రాజారావు శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. హైదర్‌గూడలోని న్యూ బ్రిలియంట్ హై స్కూల్‌లో గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాధించుకున్నాడు. ఆయన హఠత్మరణంతో స్థానిక ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆనాటి విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఆయన చేసిన కృషి ఎంతో ఉందని కొనియాడారు. ఆయన సేవలను ఎన్నటికి మరచిపోలేనివని వ్యక్తం చేశారు.

## మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్వెల్ ను ప్రారంభించిన మూడో డివిజన్ కౌన్సిలర్ కొమరగిరి సత్యవతి సుమన్



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి:** మార్చి 28 ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల నాయుడుపేట మూడో వార్డు నందు జీసస్ వాటర్ వెల్ కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం నూతనంగా బోర్వెల్ నిర్మించడం జరిగింది చర్చి ఫాస్టర్స్ సంఘం నాయకులు వారి ఆహ్వానం మేరకు మూడో డివిజన్ కౌన్సిలర్ కొమరగిరి సత్యవతి సుమన్ హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఏ కార్యక్రమం ఎవరు చేపట్టిన నా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని వారికి అన్ని సహకారాలు అందిస్తానని తెలిపారు ప్రస్తుత పరిస్థితిలో వేసవి కాలం లో ప్రజలకి నీళ్ల కొరత ఉంటుంది దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో నాయుడుపేట కాంగ్రెస్ నాయకులు గుండా మల్లయ్య షేక్ మదర్ సాహెబ్ అంకతి దామోదర్ సూదగాని జగదీష్ పొన్నెబోయిన లక్ష్మయ్య కార్యకర్తలు బంధువులు ఆత్మీయులు మిత్రులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య,ఆహారాన్ని అందించాలి



**యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి జిల్లా, ఫిబ్రవరి 28, క్రైమ్ మిర్రర్ :** సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శనివారం మోత్కూర్ మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యార్థుల వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకు న్నారు. హాస్టల్ ను పరిశీలించారు.హాస్టల్ లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నా౦ని, టీచర్స్ అందరు ఇక్కడే ఉంటారా అని అడిగి తెలుసుకున్నారు.స్కూల్ లో మంచి నీటీ సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకు న్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉన్నాయా లేవా అని కలెక్టర్ స్వయంగా వెళ్లి పరిశీలించారు . ప్రతి రోజు రెగ్యులర్ గా శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చుట్టూ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.విద్యార్థులకి మధ్యాన్నం భోజనం మెనూ ప్రకారం ఆహారం పెడుతు న్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. కిచెన్ రూమ్ లోకి వెళ్లి వంట సామాగ్రి ని, స్టోర్ రూమ్ లో వంట సరుకులు,కూరగాయలు, పప్పు, ధాన్యాలు, గుడ్లు, ఆయిల్ క్వాలిటీ వాడుతున్నారా లేదా అని పరిశీలించారు. నాణ్యమైన వంట సరుకులు,తాజా కూరగాయలు మాత్రమే వాడాలన్నారు. హిమేష్ అనే విద్యార్థి తో కలెక్టర్ మాట్లడుతూ ఏ క్లాస్ చదువుతున్నావ్, బాగా చదువుతున్నావా, పెద్ద అయ్యాక ఏమి అవ్వాలనుకుంటున్నావ్ అని విద్యార్థిని అడిగారు.మంచిగా చదుకొని ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేసారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ వేడుకలు

**కూకట్ పల్లి, మార్చి 27 (క్రైమ్ మిర్రర్):** శ్రీ రామ నవమి సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని శివయ్య గారి నగర్ లో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సుధాకర్, ఎం భాస్కర్ రావు, కమలాకర్, నవీన్, రాజు,రమణ రెడ్డి, ప్రదీప్ తదితరులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 ఆదివారం 29-3-2026

# ప్రమాణ స్వీకారం చేసిన నాగులవంచ దేవస్థాన నూతన కమిటీ



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో నీ శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు శ్రీ కోదండ రామాలయ దేవస్థానం నూతన కమిటీ చైర్మన్ గా ముత్తినేని వెంకటేశ్వర్లు లతో పాటు పాలకవర్గ సభ్యులు గా సిరిసాని రమణ ప్రసాద్వేముల కృష్ణ ,ఏటుకూరి శిరీష ,వెగ్గలం పాండు రంగాచారి(సీతంపేట), పడిశాల మైసయ్య ,వెచ్చ మంగయ్య ,పణిహారం వెంకట రమణ చార్యులు లచే ఆలయ సన్నిధిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్స్పెక్టర్ సమత శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అర్చకులు నూతన పాలకమండలిని వేదోక్త మంత్ర పఠనాలతో తమ ఆశీర్వచనాలు అందజేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా స్టేజి పరిమితికి మించి ఎకడంతో స్టేజి స్టేజి ఒక్కసారిగా కూలిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడం అదృష్టం. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకోటేశ్వరరావు పూజారి యోగాంద్రా చార్యులు మాజీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి ఉప సర్పంచ్ అంబటి శరత్ మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం ఆలస్యం నాగమణి నాగులవంచ సొసైటీ మాజీ చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు పాతర్లపాడు మాజీ సర్పంచ్ కాంద్ర పిచ్చయ్య వివిధ పార్టీల నాయకులు సిలివేరు సైదులు కొల్లేటి చిన్న బ్రహ్మయ్య ఆళ్ల పెద్ద మాధవరావు కాటంనేని పుల్లయ్య ఏటుకూరి రవి మునుకుంట్ల సుబ్బారావు రౌతు అప్పారావు బొర్రా ప్రసాద్ ఇమ్మడి కాశయ్య మాగం కొండలు పరిటాల లక్ష్మణస్వామి తన్నీరు నర్సింహారావు (చిన్నాబాయి) మునుకుంట్ల లాల్ భూదూర్ చావ అరుణ్ కుమార్ (ఈనాడు) అంబటి శాంతయ్య కొమ్మినేని వెంకటేశ్వరరావు, ఆలస్యం బసవయ్య మండేపూడి మదన్ నెల్లూరి రమేష్ (సెంటర్) భైరబోయిన హన్మంతరావుఅంబాల వెంకన్న బైరు వెంకటేశ్వర్లు కందిమల్ల సైదులు అనగాని శ్రీనివాసరావు, తాటికొండ రామక్రిష్ణ యోనిశెట్టి రాజేశ్వరరావు తేలుకుంట్ల శ్రీనివాసరావు బోడేపూడి కిరణ్ వంకాయలపాటి కళ్యాణ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# మూసీ నది పునరుజ్జీవనం కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు...

### మన సంస్కృతిని కాపాడుకోవడం కూడా

### పీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మంచిరేవులలో మూసీ నదీ తీరాన వెలిసిన పురాతన ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, చీఫ్ సెక్రటరీ రామకృష్ణ, వేం నరేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్యలతో కలిసి భూమ పూజలో పీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ శంకుసాథపన కార్యక్రమం ఆదైవ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఆధ్యాత్మిక శోభతో పాటు మూసీ తీరం మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ప్రజల పట్ల నిబద్ధత, సంకల్పం, చిత్తశుద్ధితో కూడిన పాలనే లక్ష్యమన్నారు. ప్రజలే దైవంగా, వారి ఆదేశాల మేరకు ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముందుకు సాగడం జరుగుతుందన్నారు.

# కోదాడ పట్టణంలో పోలీసు అధ్వర్యంలో హెల్మెట్ వినియోగం పై అవగాహన ర్యాలీ..

**హెల్మెట్ ధరించి ప్రమాదాలలో రక్షణ పొందండి.. కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి.**



**కోదాడ మార్చి 28 ( క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలో కోదాడ పట్టణ పోలీసులు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగం పై అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగినది. కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని కోదాడ సబ్ డివిజనల్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ తో కలిసి ప్రారంభించారు. ర్యాలీ ఖమ్మం క్రాస్ రోడ్డు నుండి రంగా థియేటర్ క్రాస్ రోడ్డు వరకు నిర్వహించి స్థానిక ప్రజలకు, వాహనదారులకు, స్థానిక వ్యాపారులకు హెల్మెట్ వినియోగం పట్ల అవగాహన కల్పించారు. ర్యాలీ నందు పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పౌరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. ద్విచక్ర వాహనంపై కూర్చునే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత హెల్మెట్ వినియోగం అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు. ప్రతి పౌరుడు, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాల పట్ల, సురక్షిత ప్రయాణం పట్ల, రహదారుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రజలకు రోడ్డు నియమాల పట్ల, జాగ్రత్తల పట్ల విస్తృతంగా అవగాహన కల్పిస్తుందని ప్రజలు వాహనదారులు గమనించాలని కోరారు. వాహనదారులు వాహనాలు నిదానంగా నడపాలని అన్నారు. ఈ ర్యాలీ నందు పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, పట్టణ ఎస్ఐ సుధీర్, పోలీసు సిబ్బంది స్థానిక పౌరులు పెద్దలు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్మన్ ని సత్కరించిన క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శనివారం శంకర్పల్లి మున్సిపాలిటీ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్,కమిషనర్ యోగేష్ కుమార్,ఒకటవ వార్డ్ కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు,పదవ వార్డ్ కౌన్సిలర్ రాజంఢ్ల వసంత మహేందర్ రెడ్డి,నీ సంయుక్తంగా కలసి గత కొంతకాలంగా క్రిస్టల్ టౌన్షిప్ కాలనీలో నెలకొని ఉన్న ప్రధాన సమస్యలైనా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ,సిసి రోడ్ల నిర్మాణం,విధి దీపాల ఏర్పాటు,మొదలగు సమస్యల గురించి చర్చించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది.దానికి స్పందించి ఇంజనీర్ నీ పిలిచి క్రిస్టల్ టౌన్షిప్ సమస్యలకుపై నివేదికను రూపొందించాలని తెలపడం జరిగింది. సిసి రోడ్డు నిర్మాణం చేపడుదాం అని తెలుపగా,కాలనీలో ప్రధానంగా సెంట్రలైజ్డ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాత సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులం కోరడం జరిగింది. దానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది.అనంతరం నూతనంగా చైర్మన్ పదవిని చేపట్టిన మున్సిపాలిటీ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ ,మున్సిపాలిటీ కమిషనర్ యోగిష్ కుమార్ నీ, వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు నీ, రాజంఢ్ల వసంత మహేందర్ రెడ్డి నీ, షాలువతో సత్కరించి అభినందనలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి , క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ ,అధ్యక్షులు ఎం విఠలయ్య, కొలాన్ గోవింద్ రెడ్డి,అధ్యక్షులు కొలాన్ ప్రతాప్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి మర్పల్లి అశోక్, సంయుక్త కార్యదర్శి కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, కాలనీవాసులు రవికుమార్,రాఘవేందర్ రెడ్డి,రామ చంద్రయ్య, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సదరన్ క్యాంపుల నిర్వహణపై సమీక్ష సమావేశం



**సెర్ప్ సీ.ఈ.వో దివ్య**

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు**

**యాదాద్రి జిల్లా, మార్చి 28,క్రైమ్ మిర్రర్:** సదరం క్యాంపుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెర్ఫ్ సి ఈ ఓ దివ్య శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో సదరం పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని, అలాగే యూ.డి. ఐ.డి దరఖాస్తులపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో సదరం సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ కేసులను త్వరితగతిన క్లియర్ చేయాలన్నారు . యూ డి ఐ డి దరఖాస్తులు వచ్చిన వెంటనే సధరం లో నమోదు చేయాలన్నారు.కొత్త దరఖాస్తులపై సమయానికి వికలాంగత సర్టిఫికేట్లు జారీ చేయాలన్నారు.రెన్యువల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కారం కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలన్నారు. యు.డి.ఐ.డి కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, సంబంధిత డేటాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు .డిజిటైజేషన్, సరెండర్ మరియు పోగొట్టుకున్న కార్డుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.ఎన్ హెచ్ సి,పిడబ్ల్యుడి, ఎస్ హెచ్ జి ఎస్ సభ్యులలో యూ.డి.ఐ.డి కార్డులు లేనివారికి వెంటనే జారీ చేయాలన్నారు. అనంతరం డి.ఆర్.డి.ఓ నాగిరెడ్డి మాట్లాడుతూ... ఈ నెలకు సంబంధించిన సదరం స్లాట్లు ఇప్పటికే విడుదలయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు క్యాంపులకు సకాలంలో హాజరు కావడానికి వారికి ఫోన్ కాల్ ద్వారా ముందస్తుగా సమాచారమివ్వాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డా. కిరణ్,సుమన్,సదరం సిబ్బంది పాల్గొన్నారు.

# బొమ్మిరెడ్డి హర్షిత రెడ్డి ప్రతిభకు 'లక్షల'వరం

**టాలెంట్ టెస్ట్‌లో టాపర్‌గా చౌటుప్పల్ గురుకుల విద్యార్థిని**

**అండగా నిలిచిన రిలయన్స్, ఎఫ్ఎఫ్ఈ సంస్థలు**

**ఉన్నత చదువుల కోసం ఏకంగా రూ.4 లక్షల స్కాలర్‌షిప్..**




**చౌటుప్పల్, మార్చి 28, క్రైమ్ మిర్రర్:** ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు.. సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు" అనడానికి చౌటుప్పల్ గురుకుల పాఠశాల విద్యార్థిని బొమ్మరెడ్డి హర్షితరెడ్డి నిదర్శనం. చౌటుప్పల్ తెలంగాణ గురుకుల పాఠశాలలో 2022-23 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన బొమ్మిరెడ్డి హర్షితరెడ్డి, రిలయన్స్, ఎఫ్ఎఫ్ఈ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయిలోనే టాపర్‌గా నిలిచి సత్తా చాటింది. ఆమె అద్భుత ప్రతిభకు మెచ్చిన ఆయా సంస్థలు ఆమె భవిష్యత్ విద్యాభ్యాసానికి భారీ ఆర్థిక భరోసాను కల్పించాయి. టాపర్‌గా నిలిచిన హర్షితరెడ్డికి రిలయన్స్ సంస్థ రూ.2 లక్షలు, ఎఫ్ఎఫ్ఈ సంస్థ రూ.2 లక్షలు.. కలుపుకుని ఏకంగా రూ.4 లక్షల రూపాయల భారీ ఉపకారవేతనాన్ని మంజూరు చేశాయి. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ సంస్థలు ఇంత భారీ మొత్తంలో స్కాలర్‌షిప్ ఇవ్వడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులోనూ ఆమె చదువుకు అండగా ఉంటామని ఆ సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రోత్సహించిన రిలయన్స్, ఎఫ్ఎఫ్ఈ సంస్థలకు గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ టి. విజిత కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా బార్ అసోసియేషన్ నూతన కమిటీ

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ 2026-2027 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైనా ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు యడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికైన నూతన కమిటీ మెంబెర్స్ అందరు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు యడ్లపల్లి రమేష్ వైస్ ప్రెసిడెంట్ షేక్ జానీమియా జనరల్ సెక్రటరీ కొప్పుల రవి కుమార్ జాయింట్ సెక్రటరీ శిరీష స్పోర్ట్స్ సెక్రటరీ రామ్ దాస్ నాయక్ లైబ్రరీ సెక్రటరీ కళ్యాణి ట్రెజరర్ కేవీడీ రాజేశ్వరి లేడీ రిప్రజెంటేటివ్ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



# అన్‌ఫిట్ కార్మికులకు మళ్లీ మెడికల్ బోర్డు నిర్వహించాలి

## టీబీజీకేఎస్ డిమాండ్ -- డీవై సీఎంఓకు వినతిపత్రం



**రామకృష్ణపూర్, మార్చి 28 (క్రైమ్ మిర్రర్):** మెడికల్ బోర్డుల్లో అన్‌ఫిట్‌గా ప్రకటించిన సింగరేణి కార్మికులకు మరోసారి అవకాశం ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రిలో డీవై సీఎంఓ డాక్టర్ మధుకుమార్‌ను టీబీజీకేఎస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు.టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ జులై, నవంబర్ నెలల్లో నిర్వహించిన మెడికల్ బోర్డుల్లో అర్హత ఉన్న కార్మికులను కూడా అన్‌ఫిట్‌గా ప్రకటించారని తెలిపారు. వారికి మరోసారి మెడికల్ బోర్డు నిర్వహించి న్యాయం చేయాలని కోరారు.సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్, మారుపేర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ సంఘాలకు సూచించారు.కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టే పోరాటాల్లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీలు ముద్దసాని కృష్ణ, నక్క సురేష్, జమదగ్ని, విద్యాసాగర్ రెడ్డి, పెంచల శ్రీనివాస్, ఈశ్వర్, సివిల్ డిపార్ట్‌మెంట్ పిట్ సెక్రటరీ దబ్బేటి సంతోష్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు రామిడి కుమార్, జాడి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.



## ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన బార అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి :** ఖమ్మం జిల్లా బార్‌అసోసియేషన్ కి 2026-2027 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన ఈ.సి మెంబెర్స్ అందరూ ఈరోజు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ రాజగోపాల్ గారిని జిల్లా బార్ ఆసోసియేషన్ నూతన అధ్యక్షులు యాడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు యడ్లపల్లి.రమేష్( నూతన అధ్యక్షుడు) ా్ఖ.జానీ మియా ( వైస్ ప్రెసిడెంట్) కొప్పుల.రవికుమార్( జనరల్ సెక్రటరీ )ఙ.శిరీష( జాయింట్ సెక్రెటరీ )ఙ.రాందాస్(స్పోర్ట్స్ సెక్రటరీ)ఙ.కళ్యాణి(లైబ్రరీ సెక్రటరీ) ఖఎఙ.రాజేశ్వరి(ట్రెజరర్) ఖ.రాధమ్మ(లేడీ రిప్రజెంటేటివ్).



## యధేచ్చగా ధర్మకాంటలు ఏర్పాటు చేసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్న దళారులు

### ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ప్రారంభం ఎప్పుడో..?

### దరిదాపులో కొనుగోలు కేంద్రాలు లేక దళారులని ఆశ్రయిస్తున్న రైతన్నలు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో యధావేచ్చగా ధర్మకాంటలు ఏర్పాటు చేసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్న దళారులు. మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు ఆరు కాలం కష్టపడి శ్రమించి వరి ధాన్యం పండించి నేడు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మండల కేంద్రంలో ఉన్న దళారులకు అమ్ముకోవడం జరుగుతుంది. ప్రజా ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని చెప్పకునే కాంగ్రెస్ ప్రభుత్వ స్పందించి తక్షణమే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు(ఎం)శాఖ డిమాండ్ చేస్తుంది.

## ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని సంత వేలంపాట విజయవంతం



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంత మరియు మేకల తై బజార్ బహిరంగ వేలంపాట సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ అధ్యక్షతన,మండల అభివృద్ధి అధికారి రాములు నాయక్, మండల పంచాయతి అధికారి శ్యామ్ కుమార్ మరియు ఆత్మకూరు(ఎం)గ్రామ పంచాయతీ కార్యదర్శి అంబోజు శేఖర్ సమక్షంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది.ఈ వేలంపాటలో పశువులు, మేకల సంతకు అధికంగా వేలంపాట పాడిన లోడి ప్రదీప్ రూ.45,000లకు చేజిక్కించుకున్నారు.అలాగే తై బజార్‌కు అత్యధికంగా వేలంపాట పాడిన మజ్జిగ రాంబాబు రూ.20,000లకు చేజిక్కించుకున్నారు.గ్రామ అభివృద్ధి మరియు పారదర్శక విధానంలో ఈ వేలంపాట నిర్వహించబడినదని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

## గ్రామస్తుల సమస్యల పరిష్కారం కోసం రాఘవాపురం గ్రామ పంచాయతీ పాలకవర్గం సిబ్బంది మార్నింగ్ వాక్




క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 28: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రాఘవాపురం గ్రామంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలో మరియు గ్రామంలో మొదటి సారిగా సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి మరియు పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు అందరూ కలిసి మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధులలో తిరుగుతూ గ్రామ ప్రజల సమస్యలని తెలుసుకోవడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు పురోగతిని కూడా పరిశీలించడం జరిగింది. లబ్ధిదారులని వెంటనే పూర్తి చేయగలరని చెప్పడం జరిగింది. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేయడం జరిగింది మరియు మధ్యాహ్నం భోజనంను తనిఖీ చేసి అక్కడే పిల్లలతో భోజనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యరుకల యతీశ్వర్ గౌడ్,ఉప సర్పంచ్ మహమ్మద్ మున్నీ అమీరుద్దీన్ , పంచాయతీ కార్యదర్శి గుర్రం వినోద్ కుమార్,వార్డు సభ్యులు మూషం శ్రీనివాస్,కూరెళ్ళ మహేష్,తుమ్మలగూడెం మచ్చగిరి,కూరపాటి అరుణ, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి

### కాస్మోటాలజీ కోర్సులతో ఆర్థికాభివృద్ధి సాధ్యం: శ్రీవాణి రాధాకృష్ణ




**మందమర్రి, మార్చి 28( క్రైమ్ మిర్రర్):** కాస్మోటాలజీ వంటి వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకుని యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ సూచించారు. శనివారం మందమర్రి ఏరియా స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్‌లో కాస్మోటాలజీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన 31 మంది అభ్యర్థులకు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు.ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ కోర్సును పూర్తి చేసిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత తమ భవిష్యత్తును అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులను నేర్చుకుని యువత ఆర్థికంగా ఎదగడమే కాకుండా, ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, జీఎంవీటీసీ అడిషనల్ మేనేజర్ టి. శ్రీధర్, అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ అశోక్ కుమార్, కాస్మోటాలజీ ట్రైనర్ ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## ముప్పారం ప్రకాశం ని పరామర్శించిన మంత్రి దామోదర్ రాజ నర్సింహా



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మార్చి 28:** హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ప్రాంతంలో ఉన్న సహార ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆందోల్ నియోజకవర్గం డాకూర్ గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమ నాయకుడు, సాహసం అధినేత ముప్పారం ప్రకాశం ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా పరామర్శించారు. ప్రకాశం ఆరోగ్య పరిస్థితిని మంత్రి స్వయంగా అడిగి తెలుసుకుని, ఆయనకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. ప్రకాశం త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి వెంట రంగారెడ్డి జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ లలిత, ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ నరేష్ ఉన్నారు.

## తెలంగాణ జాగృతిలోకి భారీగా చేరికలు



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్:)** తెలంగాణ జాగృతి పార్టీ బలోపేతమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లాలో భారీగా చేరికలు జరిగాయి. శనివారం నగరంలోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి సమక్షంలో, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో చేవెళ్ళ మరియు కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల నుండి సుమారు 100 మందికి పైగా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ జాగృతిలో చేరారు. ?తెలంగాణ జాగృతి కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, రాష్ర అధికార ప్రతినిధి నల్లమల్ల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దూకుంట్ల నరేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితర నేతలు కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ?ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ ?ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఒక కీలకమైన సంధిదశలో ఉందని, ప్రజలు ఆశిస్తున్న అభ్యుదయకరమైన నాయకత్వాన్ని అందించేందుకు కల్వకుంట్ల కవితమ్మ నాయకత్వంలోని తెలంగాణ జాగృతి సిద్ధంగా ఉందని, ఉద్యమ కాలం నుండి తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేయడంలో కవిత పోషించిన పాత్ర అసామాన్యమైనదని, ఇప్పుడు అదే స్ఫూర్తితో ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఈ పార్టీ ఎదుగుతుందని, కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని, యువత, మహిళలు, మరియు బడుగు బలహీన వర్గాలకు ఈ ప్రయాణం ఒక పెద్ద భరోసా అని, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత రాజకీయ గందరగోళానికి తెరదించి, ప్రగతిశీల మార్గంలో తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేయబోతున్నట్లు వెల్లడించారు.

# కల్తీ ఆహార పదార్థాల తయారీ కేంద్రాలపై మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల దాడులు

### ముగ్గురు వ్యక్తుల అరెస్టు

### సామాగ్రీ, ఆహార పదార్థాల స్వాధీన

**గండిపేట(క్రైం మిర్రర్):** కల్తీ మిక్చర్, ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులతో పాటు హెచ్--పాస్ట్ బృందం సంయుక్తంగా మూడు కేంద్రాలపై దాడులు నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బాబుల్‌రెడ్డినగర్, లక్ష్మీగూడ ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారని తమకు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. అరుణ్ కుమార్ ఫుడ్ కంపెనీ పేరుతో అరుణ్‌కుమార్(34) అనే వ్యక్తి ఎటువంటి నిబంధనలు, పరిశుభ్రత పాటించకుండా, రసాయనాలను ఉపయోగించి మిక్చర్‌ను తయారుచేస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాగే లక్ష్మీగూడలో అంజని ఫుడ్స్ పేరుతో మస్తాన్ రెడ్డి(46) అనే మరో వ్యక్తి ఉస్మానియా బిస్కెట్లు, చిక్కీలను తయారు చేస్తుండగా,





బాబుల్‌రెడ్డినగర్‌లో జైన్ ఫుడ్ పేరుతో విశాల్ జైన్(41) అనే మరో వ్యక్తి నమ్‌కీన్, మిక్చర్‌లను తయారు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. ఎటువంటి నిబంధనలు, పరిశుభ్రత పాటించకుండా, రసాయనాలను ఉపయోగించి ఈ పదార్థాలను తయారు చేస్తూ, హైదరాబాద్‌లోని స్థానిక దుకాణాలకు, వివిధ షాపుకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు ఆహార పదార్థాలు, పరికరాలను స్వాధీనం చేసుకోని కేసు నమోదు ఏసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అమెరికా ఆర్థిక వ్యవస్థ కూ యుద్ధం ఓ సవాలే..!

**సామ్రాజ్యవాద యుద్ధాలతో సామాన్యులపై భారం**

**వ్యాపార దృక్పథంతోనే అమెరికా యుద్ధం**

**భవిష్యత్తులో తీవ్రం కానున్న ఎరువుల కొరత**

**అమెరికా చెప్పినట్లు ఆడుతున్న మోడీ**

**సామ్రాజ్యవాద యుద్ధం – ప్రజలపై ప్రభావం' సెమినార్ లో ఆర్థిక, సామాజిక విశ్లేషకులు డి. పాపారావు, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**






ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో): సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్... ఇరాన్‌పై చేస్తున్న యుద్ధంలో కాలి బూడిద అవుతున్నది యుద్ధ ట్యాంకులు, మిస్సైల్స్, డ్రోన్స్ మాత్రమే కాదు, మూడో ప్రపంచ దేశాల్లోని కార్మికులు -- కర్షకులు, సామాన్యుల శ్రమశక్తి అని ఆర్థిక సామాజిక విశ్లేషకులు డి. పాపారావు పేర్కొన్నారు. దేశీయ ఇంధన అవసరాలను 80% పైగా దిగుమతి పై ఆధారపడడంతో యుద్ధం వలన ప్రధానంగా ప్రభావమవుతున్న దేశాలలో మన దేశం ఒకటి అన్నారు. వ్యాపార దృక్పథంతోనే అమెరికా ఈ యుద్ధం చేస్తోందన్నారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బీవీకే), ఖమ్మం ఆధ్వర్యంలో స్థానిక మంచికంటి ఫంక్షన్ హాల్ లో శనివారం ఏర్పాటు చేసిన ' సామ్రాజవాద యుద్ధం – ప్రజలపై ప్రభావం' సెమినార్ లో పాపారావు ముఖ్య వక్తగా మాట్లాడారు. హర్మూజ్ జల సంధి మూసివేతతో ఇంధన దిగుమతులతోపాటు పశ్చిమాసియా దేశాలకు ఎగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ గూడ్స్ పైన ప్రభావం పడిందన్నారు. ఫార్మా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల కంటైనర్‌పై వార్ సెస్ కింద అదనంగా రూ.రెండు లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం తెలంగాణలోని ఉత్పాదక పరిశ్రమల కార్మికులపై ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా ఎల్.ఎన్.జి వంటి ముడి పదార్థాల కొరత ఏర్పడటంతో పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించుకోవలసి వస్తోందన్నారు. రసాయనాలు, ప్లాస్టిక్‌లు, ఆహార ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలు ఉత్పత్తి మందగించాయన్నారు. సిరామిక్, ఉక్కు, వస్త్ర, ఫ్యాబ్రికేషన్ యూనిట్లను పెద్ద ఎత్తున మూసివేయడానికి కారణమవుతోందన్నారు. ఇండస్ట్రియల్ గ్యాసెస్, కెమికల్స్ వంటి ముఖ్యమైన ముడి పదార్థాల కొరతకు దారితీసిందన్నారు. కొన్ని తయారీ యూనిట్లలోని పారిశ్రామిక క్యాంటీన్లు ఇప్పటికే మూతపడ్డాయన్నారు. ఈ అస్థిరత తెలంగాణ నుండి గల్ఫ్ ప్రాంతానికి జరిగే ఎగుమతులకు అంతరాయం కలిగించిందన్నారు. భవిష్యత్తులో ఎరువుల కొరత తీవ్రతరం అవుతుందన్నారు. ఇరాన్ తో యుద్ధానికి దిగేముందే అమెరికా అంచనా గాడి తప్పిందని తెలిపారు. యుద్ధం కారణంగా అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. సీఎన్‌జీ కొరతతో అనేకమంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. విదేశాలకు వెళ్తున్న భారతీయులలో దేశంలోని మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాల నుండి అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల కలల సీమలకు వెళ్తున్న వైట్ కాలర్ ఉద్యోగుల కంటే గల్ఫ్ కంట్రీస్‌లో ఉపాధి పొందుతున్న కార్మికులే అధికమన్నారు. గల్ఫ్ (యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్) దేశాలలో సుమారు తొంభై లక్షలమంది భారతీయ కార్మికులు ఉంటే... తెలంగాణ నుండి సుమారు పదిహేను లక్షల మంది కార్మికులు గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్నారన్నారు. భారతదేశ వ్యవసాయ రంగంలో కీలకమైన ఖరీఫ్ సీజన్‌కు ముందు యుద్ధం కారణంగా ఖతార్ నుండి ఎల్ఎన్‌జీ రవాణా నిలిచిపోవడం దేశీయ యూరియా తయారీని ప్రభావితం చేస్తోందన్నారు. యూరియా ఉత్పత్తిలో డెబ్బయి శాతం వ్యయం సహజ వాయువుదేనని తెలిపారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సిఎల్)పై గ్యాస్ కొరత ప్రభావం పడిందన్నారు. ఆర్.ఎఫ్.సి.ఎల్ యూరియా ఉత్పత్తిలో దాదాపు సగభాగం రాష్ట్రానికే సరఫరా అవుతుందన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చడానికి ఇరాన్ సహజ వాయువును పైప్‌లైన్ ద్వారా తీసుకువచ్చే ప్రాజెక్టును అమెరికా ఆంక్షల కారణంగా భారతదేశం వైదొలిగిందన్నారు. ప్రాజెక్టు నుండి వైదొలగకుండా పైప్ లైన్ పూర్తి చేసి ఉంటే, నేడు ఎంతో చౌక ధరకు ఇరాన్ నుండి సహజవాయువు మనకు అందేదని చెప్పారు. ప్రపంచ ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపించేది కమ్యూనిస్టులు మాత్రమే తెలిపారు. భవిష్యత్ కమ్యూనిస్టులు దేనిని అన్నారు.

**అమెరికా చేతిలో మోడీ కీలుబొమ్మ**

భారతదేశ పాలకవర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగిపోతున్న కారణంగా నేడు దేశంలోని కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. వ్యాపార, వాణిజ్య రంగంలో శతాబ్దాలుగా ఇరాన్‌తో భారత్‌కు అనుబంధం ఉందన్నారు. దశాబ్దాలుగా మిత్రదేశాలుగా ఉన్నాయని తెలిపారు. దీనికి భిన్నంగా ప్రస్తుత బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్, అమెరికన్ సామ్రాజ్యవాదంతో అంటకాగుతోందన్నారు. మన ప్రభుత్వం ఏం చేయాలో, ఎక్కడ సంతకం పెట్టాలో, ఎక్కడ పెట్టకూడదో అమెరికా నిర్ధారిస్తుందన్నారు. బీవీకే జనరల్ మేనేజర్ వై . శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్లో బండారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## యాస రాంరెడ్డి పార్థీపదేహానికి నివాళులు అర్పించిన మండల రెడ్డి సంఘం

**నిరుపేద రెడ్డి కుటుంబానికీ చెందిన యాస రాంరెడ్డి కుటుంబ సభ్యులకు మండల రెడ్డి సంఘం ఆర్థిక సహాయం**

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న మృతి చెందిన విషయం తెలిసిన ఆత్మకూరు(ఎం) నియోజకవర్గ రెడ్డి సంఘం నాయకులు జమ్మల కృష్ణా రెడ్డి మరియు మండల రెడ్డి సంఘం అధ్యక్షులు బొబ్బల ఇంద్రా రెడ్డి మృతుడు యాస రాంరెడ్డి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి 3000 రూ.ల ఆర్థిక సహకారంను బాధిత కుటుంబ సభ్యులకు అందచేసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.వారితో రెడ్డి సంఘం నాయకులు బొబ్బల పద్మా రెడ్డి ఉన్నారు.

## ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిత్ర పటానికి పాలాభిషేకం



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం): మార్చి 28:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ పరిధిలోని ఆలేరు పెద్దవాగులో నీళ్లు పారుతున్న సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపాలిటీ చైర్పర్సన్ బీజాని బాలమణి భాస్కర్,వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయలు, పట్టణ అధ్యక్షులు ఎంఏ ఎజాస్, సింగిల్ విండో డైరెక్టర్ సాగర్ రెడ్డి, కౌన్సిలర్లు మరియమ్మ మార్క్, పస్తం ఆంజనేయులు,మల్లెల సరిత శ్రీకాంత్ ,జూకంటి సంపత్, జట్ట నీరజ సిద్ధులు,ఎంఎస్ విజయ్,ఎండీ జనువద్దీన్,అగ్గిడి శ్రీశైలం,ముదిగొండ శ్రీకాంత్, పోరాల సతీష్,ఎండి జావిద్, ఎండి బాబా,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీసు వీర భద్రయ్య 12వ వర్ధంతి

**సేవా కార్యక్రమాలతో వీర భద్రయ్య వర్ధంతి నిర్వహణ**

**పులివెందులలో సేవా కార్యక్రమాలు నిర్వహణ**

**నిత్యావసరాల పంపిణీ, ఉపాధి అవకాశాలపై పిలుపు**





**పులివెందుల, మార్చి 28(క్రైమ్ మిర్రర్):** స్వర్గీయ పోలీసు వీర భద్రయ్య 12వ వర్ధంతి సందర్భంగా పులివెందులలో దివ్యాంగులకు సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సంస్మరణ సభలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని, దివ్యాంగులకు సరుకులు అందజేశారు.భవిష్యత్తులో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సరస్వతి, రీసెర్చ్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రేడియం రిఫ్లెక్టర్ స్టిక్కర్ల అధిక ధరలు తగ్గించాలి

**లారీ ఓనర్స్ అసోసియేషన్ ధర్నా -- ఎంఎంవీఐకి వినతిపత్రం**

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 28:** వాణిజ్య వాహనాల ఫిట్‌నెస్ కోసం తప్పనిసరి చేసిన రేడియం రిఫ్లెక్టర్ స్టిక్కర్ల ధరలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఎంవీఐ సి.హెచ్. భాస్కర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సింగాపురం మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య వాహనాలకు రేడియం రిఫ్లెక్టర్ స్టిక్కర్ల కొనుగోలులో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం చిన్న, మధ్య తరహా వాహన యజమానులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని అన్నారు. రవాణా శాఖ నియమించిన డీలర్లు, కాంట్రాక్టర్ల ద్వారానే స్టిక్కర్లు కొనాలని నిబంధన విధించడం వల్ల ధరలు రెండింతలు పెరిగాయని ఆరోపించారు.ఓపెన్ మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే స్టిక్కర్లను డీలర్లు, కాంట్రాక్టర్లు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితి వాహన యజమానులకు భారంగా మారిందని, ప్రభుత్వం వెంటనే ధరలను సమీక్షించి తగ్గించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి మర్రి సురేష్ రెడ్డి, కోశాధికారి ఎ. నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎ. నాగరాజు, కార్యదర్శి జి. రాంభద్రారెడ్డి, ఇక్బాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.




# మిర్యాలగూడలో వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణ ముగింపు

**46 గ్రామ పంచాయతీల 394 మందికి అవగాహన**

**పంచాయతీరాజ్ చట్టం, బాధ్యతలపై మార్గదర్శనం**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 28: మిర్యాలగూడ మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మండలంలోని 46 గ్రామపంచాయతీలకు చెందిన 394 మంది వార్డు సభ్యులకు రెండు బ్యాచ్లుగా ఈ శిక్షణను నిర్వహించారు.ట్రైనర్లు టీఓటీ సతీష్, మురళీమోహన్, దుర్గయ్యలు పంచాయతీరాజ్ వ్యవస్థపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా 2018 పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ విధులు–బాధ్యతలు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పాత్రపై వివరించారు.గ్రామపంచాయతీ సమావేశాల నిర్వహణ, పారిశుధ్య చర్యలు, వనమహోత్సవం, వీధిదీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లు, గ్రామాభివృద్ధి పనుల ప్రణాళిక, ఆదర్శ గ్రామాల రూపకల్పన వంటి అంశాలపై కూడా సభ్యులకు శిక్షణ ఇచ్చారు.శిక్షణ ముగింపు సందర్భంగా శ్రీనివాస్‌నగర్, తుంగపాడు వార్డు సభ్యులు బుచ్చిరెడ్డి, నవ్య, శ్రీనివాస్, ఐలాపురం వార్డు సభ్యులు మాట్లాడుతూ శిక్షణ తరగతులు సమర్థంగా నిర్వహించారని తెలిపారు. చట్టంపై స్పష్టమైన అవగాహన కల్పించారని అభిప్రాయపడ్డారు.శిక్షణ పూర్తిచేసుకున్న వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎం. శేషగిరిశర్మ, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, సూపరింటెండెంట్ కర్ణాకర్ రావు, సీనియర్ అసిస్టెంట్ పాషా, కంప్యూటర్ ఆపరేటర్లు మణికంఠ, పృథ్వీతేజ, చారి, మౌనిక, టైపిస్టు ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఇంధన కొరత లేదు : కొలను శంకర్ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)**: భారతదేశంలో ఇంధన కొరత లేదని, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశంలో వస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని, ప్రపంచవ్యాప్త పరిస్థితుల దృష్ట్యా ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని, యుద్ధం నేపథ్యంలో వివిధ దేశాలలో ప్రజలు ఇంధన కొరత తో పాటు ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారని కానీ భారతదేశంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని దీనికి మూల కారణం మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని, మోడీకి భారతదేశంలో పాటు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక దేశంలోని కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు దేశంలో అస్థిరతను సృష్టించేందుకు ఇంధన కొరత అంటూ ధరలు పెరిగాయి అంటూ లేనిపోని వదంతులు సృష్టిస్తున్నారని కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీల మాటలను నమ్మే పరిస్థితిలో దేశ ప్రజలు లేరని ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిస్థితులు అలాగే భారత దేశంలో నెలకొన్న పరిస్థితులను దేశ ప్రజలు గ్రహిస్తున్నారని కొలను శంకర్ రెడ్డి తెలిపారు.